Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 సంచిక : 356 పేజీలు 8 వెల : 5 శనివారం 07 జూన్ 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్న విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| | బ్లాక్ & వైట్ పేజి |
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఫ్రంట్ పేజి : 30,000/- |

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

## ఏపీలో మెగా డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

### శుభాకాంక్షలు తెలిపిన బాబు, లోకేశ్

### విజయవాడలో కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**అమరావతి:** ఏపీలో మెగా డీఎస్సీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం విడతలో 9 గంటల వరకు అభ్యర్థులను అనుమతించారు. 9.30 నుంచి 12 గంటల వరకు ఎగ్జామ్ ఉండనుంది. ఈ నెల 30 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఏపీలో 137, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.మెగా డీఎస్సీలో 16,347 ఉపాధ్యాయ పోస్టులకు 3,36,305 మంది అభ్యర్థులు 5,77,675 దరఖాస్తులు సమర్పించారు. మధ్యాహ్నం విడతలో 2 గంటలకు అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమచారు. 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. మరోవైపు డీఎస్సీ అభ్యర్థులందరికీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. మెగా డీఎస్సీలో భాగంగా తొలిరోజు శుక్రవారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన సెషన్-1లో విద్యార్థులు హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ నగరంలోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలోని పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి ఇబ్బందిలేకుండా ప్రశాంత వాతావరణంలో అభ్యర్థులు పరీక్ష రాసేందుకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ నెలరోజుల పాటు జరిగే మెగా డీఎస్సీ పరీక్షలు రాసేందుకు నగరంలో దాదాపు 30 వేల మందికి ఏర్పాట్లు చేశామని, జిల్లా పరిధిలోని పది పరీక్షా కేంద్రాలకు ప్రత్యేకంగా అధికారులను నియమించామని వెల్లడించారు. తాగునీటి సౌకర్యం, వైద్య శిబిరం, నీడ సౌకర్యం వంటివాటిని ఏర్పాటు- చేసినట్లు తెలిపారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) కావడంతో సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు తెలెత్తకుండా ప్రత్యేక బృందాలతో డెస్క్‌టాప్, పవర్ బ్యాకప్ వంటివాటిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పోలీసు శాఖ భాగస్వామ్యంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు- చేశామని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుకు చర్యలు తీసుకున్నామన్నారు. ట్రాఫిక్ సమస్యలు ఎదురుకాకుండా ప్రణాళిక ప్రకారం చర్యలుతీసుకోవడం జరిగిందని.. తిరువూరు, మైలవరం వంటి ప్రాంతాలకు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ లక్ష్మిాశ తెలిపారు.

## కాశ్మీర్‌లో మరో అద్భుతం ఆవిష్కరణ



- చీనాబ్ రైల్వే వంతెనకు ప్రధాని మోడీ పచ్చజెండా
- రైలు బోగీలో ప్రయాణించిన మోడీ తదితరులు
- ఈఫిల్ టవర్‌కన్నా ఎత్తయిన వంతెనగా ప్రసిద్ధి
- శ్రీనగర్-వైష్ణోదేవి మధ్య నేటి నుంచి రాకపోకలు

2లో..



# బనకచర్ల కోసం టెండర్ల ఆహ్వానం

అమరావతి: త్వరలో పోలవరం - బనకచర్లకు టెండర్లు ఆహ్వానిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్మాణం నేపథ్యంలో ఆర్థిక వనరుల సమీకరణ కోసం కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే ఏపీ ప్రతిపాదనలు పంపించిందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అటవీ - పర్యావరణ అనుమతులు, డీపీఆర్ ఆమోదం తదితర అంశాలన్నీ అనుకున్న సమయానికి జరగాలని జలవనరుల శాఖ ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు సైతం సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. హైబ్రీడ్ యాన్యుటీ- విధానంలో పోలవరం - బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆయన వివరించారు. శుక్రవారం రాజధాని అమరావతిలోని సచివాలయంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడుతోపాటు- ఆ శాఖ ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. టెండర్లకు సంబంధించిన రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీతో డ్రాఫ్ట్ డాక్యుమెంట్ రూపొందించడం, సాంకేతిక నిపుణుల పర్యవేక్షణ అనంతరం టెండర్లు పిలవడం వంటి అంశాలన్నీ జూన్ మాసాంతానికి పూర్తి కావాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. జల హారతి కార్పొరేషన్ కింద పోలవరం - బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు నిర్మాణం చేపడుతుండగా.. దీని కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఇప్పటికే ఏర్పాటు- చేశామన్నారు.మొత్తం ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 81,900 కోట్ల వ్యయం అవుతుందన్నారు. అందులో 50 శాతం అంటే రూ. 40,950 ఈఏపీ రుణంగా పొందాలని నిర్ణయించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ గ్రాంట్‌గా 20 శాతం నిధులు రూ. 16,380 కోట్లు- సమకూర్చుకోవాలని.. రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీగా 10 శాతం నిధులు రూ. 8,190 కోట్లు-.. హ్యామ్ విధానంలో మరో 20 శాతం నిధులు రూ. 16,380 కోట్లు- ఖర్చు చేస్తుందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ ప్రాజెక్ట్ డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తి కావాలని ఆయన ఆదేశించారు.కృష్ణా - గోదావరి డెల్టాకు తక్షణమే నీరు విడుదల చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. తుపాన్ల ముప్పు తప్పేలా పంట కాలం ముందుకు జరగాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 365 రోజులు భూమి పచ్చగా ఉండేలా.. అందుకోసం 3 పంటలు నిరంతరం పండించేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. బుడమేరులో పూడిక తొలగించాలని.. ఆ క్రమంలో వాగులో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా పూడిక తీత, ముళ్ల కంపలు తొలగించాలని సూచించారు. శాస్త్రీయంగా వాటర్ ఆడిటింగ్ - వాటర్ మేనేజ్‌మెంట్ జరగాలన్నారు. పిజియో మీటర్లు, సెన్సర్లు కొనుగోలుకు రూ. 30 కోట్లు- కేటాయిస్తున్నట్లు- ప్రకటించారు. భూగర్భ జలాలు పెంచడం, రిజర్వాయర్లు నింపడం, జల వనరుల సమర్థ వినియోగం జరిగేలా చూడాలన్నారు. ప్రధానంగా ఈ 3 అంశాలపై దృష్టి సారించాలని ఉన్నతాధికారులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. భూగర్భ జలాల వివరాలతో బులి-టె-న్లు విడుదల చేయాల్సి ఉందని అన్నారు. సీలేరు నీటిని కృష్ణా డెల్టాకు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఇక హంద్రీ నీవా మెయిన్ కెనాల్ వైడనింగ్ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. వెలిగొండ స్టేజ్ వన్ పనులు 2026 జూన్ నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ఆర్థిక సాయం కోసం సాస్కిలో పెట్టండన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు ప్లంజ్ పూల్ మరమ్మతులకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఒక్క ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసినా.. ఆ నీటితో మూడునాలుగేళ్లు కరువొచ్చినా వాటర్ మేనేజ్‌మెంట్ జరగాలని ఆయన ఆకాంక్షించారు. క్రాప్ ప్యాట్రన్ మార్చి.. తడి-ఆరుతడి పంటల సాగుకు యాక్షన్ ఎ÷-లాన్ రూపొందించాలని ఆదేశించారు. జల సంరక్షణ కోసం వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు నిర్మించాలని అధికారులకు సీఎం చంద్రబాబు కీలక సూచనలు చేశారు.



**ఆర్థిక వనరుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు**

**త్వరగా అటవీ,పర్యావరణ అనుమతులు, డీపీఆర్ ఆమోదం**

**ఉన్నతాధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశాలు**

## ఛత్తీస్‌ఘడ్‌లో కొనసాగుతున్న ఎన్‌కౌంటర్లు



మావోయిస్ట్ మరో అగ్రనేత భాస్కర్ హతం

మైలారపు ఆడెల్లు అలియాస్ భాస్కర్‌ది ఆదిలాబాద్

2లో..

## ఆర్‌బిఐ రెపోరేటు తగ్గింపు ప్రకటన




**స్టాక్ మార్కెట్లో భారీ ఊపు**

**గరిష్ట లాభాలను అందుకున్న షేర్లు**

ఆర్‌బిఐ రెపో రేటును తగ్గించాలనే నిర్ణయం ద్రవ్యోల్బణం తగ్గిస్తుందని అంచనా వేయడం, హోం లోన్స్ ఇచ్చే బ్యాంకు షేర్లకు ఊతం వచ్చింది.

2లో..



## రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసు

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు సుప్రీం నోటీసులు


2లో..



## బనకచర్లపై బిఆర్ఎస్ తరపున సుప్రీంలో కేసు వేస్తాం

- అబద్దాలతో కాలం గడుపుతున్న సిఎం, మంత్రులు
- ఎపి గోదావరి, కృష్ణాలు దోచుకుంటున్నా కళ్లు తెరవరా
- కేంద్రంతో పోరాటం చేయకుండా బిజెపి సైలెంట్ అయ్యింది
- ఉద్యోగులకు డిఎపై కేబినేట్‌లో ఇంతగా చర్చలా
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ హరీష్ రావు

2లో..



## నీట్- 2025 ఎంట్రెన్స్ టెస్ట్ వాయిదా

ఆగ్సట్ 3న నిర్వహించనున్న ఎన్‌బీఈ

వాయిదాను అంగీకరించిన సుప్రీం కోర్టు

2లో..

## కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలి



- తాత్సారం చేస్తే వదిలే ప్రసక్తి లేదు
- కంఠంపై తుపాకి పెట్టినా నిజాలే చెబుతా
- తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టుకు మహారాష్ట్ర ఒప్పుకోలే
- కేబినేట్ ఆమోదం తరవాత త్రీమెన్ కమిటీ వేశారు
- కాళేశ్వరం నిర్ణయం మొత్తం కెసిఆర్‌దే
- జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణలో ఈటెల వెల్లడి

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హరీష్ నాయకత్వంలో కేబినెట్ సబ్ కమిటీ వేశారన్నారు. మంత్రివర్గ ఉపసంఘం, సీడబ్ల్యూసీ రిపోర్ట్ ఆర్థిక శాఖ ముందు పెట్టారని తెలిపారు. నిజాయితీగా ఉండాలని కోరే పార్టీ బీజేపీ అని ఎంపీ తెలిపారు.

2లో..

# ఆర్‌బిఐ రెపోరేటు తగ్గింపు ప్రకటన

**న్యూఢిల్లీ:** ఆర్‌బిఐ రెపోరేటు తగ్గింపు ప్రకటనతో భారత స్టాక్ మార్కెట్లు బ్లాక్‌బస్టర్ ఫ్రైడేని చవిచూశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటు తగ్గింపుతో నిఫ్టీ 25,000 మార్క్ దాటింది. బ్యాంక్ నిఫ్టీ అయితే, ఏకంగా రికార్డు గరిష్ట స్థాయికి చేరుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఊహించిన దానికంటే ఎక్కువ రెపో రేటు తగ్గింపుతో పాటు నగదు నిల్వ నిష్పత్తి తగ్గింపుతో శుక్రవారం భారత బెంచ్‌మార్క్ సూచీలు మూడవ సెషన్‌లోనూ లాభాలు మూటగట్టుకున్నాయి. ఇక, నిఫ్టీ మూడు వారాల్లో ఉత్తమ ట్రేడ్ డే ను నమోదు చేసింది. శుక్రవారం వారాంతంలో మార్కెట్లు- ముగిసే సమయానికి సెన్సెక్స్ 746.95 పాయింట్లు- లేదా 0.92 శాతం పెరిగి 82,188.99 వద్ద ఉంది. నిఫ్టీ 252.15 పాయింట్లు- లేదా 1.02 శాతం పెరిగి 25,003.05 వద్ద ఉంది. ఇక, నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.2 శాతం పెరగగా, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.8 శాతం పెరిగాయి. ఇక, బిఎస్ఇ-లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ నిన్నటి రూ. 447.5 లక్షల కోట్ల నుండి రూ.451 లక్షల కోట్లకు పెరగడంతో పెట్టుబడిదారుల సంపద ఒక్కరోజులో రూ. 3.5 లక్షల కోట్లకు పైగా పెరిగింది. ఆర్‌బిఐ రెపో రేటును తగ్గించాలనే నిర్ణయం ద్రవ్యోల్బణం తగ్గిస్తుందని అంచనా వేయడం, హోం లోన్స్ ఇచ్చే బ్యాంకు షేర్లకు ఊతం వచ్చింది. దీంతో బ్యాంకింగ్ స్టాక్స్ తోపాటు రియాల్టీ ఇండెక్స్ 4 శాతం పెరిగింది. దీంతోపాటు-, బంగారు రుణాలకు సంబంధించి లోన్-టు-వాల్యూ నిష్పత్తి పరిమితిని 85శాతానికిపెంచుతామని ఆర్‌బిఐ చెప్పడంతో గోల్డ్ ఫైనాన్సింగ్ కంపెనీల షేర్లు 5 నుంచి 7 శాతం వరకూ పెరిగాయి. ఆర్బీఐ తాజా నిర్ణయం.. బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.2.5 లక్షల కోట్ల లిక్విడిటీ-ని ఇంజెక్ట్ చేయడానికి దోహదపడింది. ఆర్బీఐ.. ఈని దశలవారీగా 100 బేసిస్ పాయింట్లు- తగ్గించి 3శాతానికి తీసుకురావడంతో ఇది సాధ్యమైంది. తద్వారా బ్యాంకుల దగ్గర నగదు నిల్వలు పెరిగి మరిన్ని రుణాలిచ్చేందుకు వీలవుతుంది. ఫలితంగా మార్కెట్లోకి మనీ మరింతగా వస్తుంది. ఇలా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ ఆర్బీఐ 9.5లక్షల కోట్ల డబ్బును వ్యవస్థలోకి తీసుకువచ్చింది. ఆర్బీఐ తాజా నిర్ణయాలతో నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 1.5 శాతం పెరిగి కొత్త రికార్డు గరిష్ట స్థాయి 56,695కి చేరుకుంది. ఆటో, మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ప్రైవేట్ బ్యాంక్ ఇండెక్స్‌లు ఒక్కొక్కటి 1 శాతానికి పైగా పెరిగాయి. మరోవైపు, మీడియా ఇండెక్స్ 1 శాతం తగ్గింది. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్, జెఎస్‌డబ్ల్యు స్టీల్, యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకి ఉన్నాయి. అయితే హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, భారత్ ఎలక్ట్రానిక్స్, టాటా స్టీల్, భారతి ఎయిర్-టెల్, సన్ ఫార్మా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ లో 110 కంటే ఎక్కువ స్టాక్‌లు వాటి 52 వారాల గరిష్ట స్థాయిలను తాకాయి. వీటిలో గోద్రేజ్ ఇండస్ట్రీస్, ముత్తూట్ ఫైనాన్స్, బజాజ్ హోల్డింగ్స్, మణప్పురం ఫైనాన్స్, మహారాష్ట్ర స్కూటర్స్, ౹ఈ÷ృ ఇండియా, ఆ÷ఖ స్మాల్ ఫైనాన్స్, ఐఉఎఈ ఆఃఈ, ఐఉఎఈ బ్యాంక్, ఫోర్టిస్ హెల్త్‌కేర్, ÷ూఎ, ఆర అపోలో, వెల్‌స్పన్ కార్ప్, అబాట్ ఇండియా, అనుపమ్ రసాయన్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఆస్ట్రాజెనెకా ఫార్మా, సోలార్ ఇండస్ట్రీస్, లాయిడ్స్ మెటల్స్, మొదలైన స్టాక్స్ ఉన్నాయి.

# ఛత్తీస్‌ఘడ్‌లో కొనసాగుతున్న ఎన్‌కౌంటర్లు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లు ఆవోలను హతమారుస్తూనే ఉన్నాయి. ఇప్పటికే జరిగిన వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. తాజాగా రెండోరోజూ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో శుక్రవారం భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మరో కీలక నేత మైలారపు ఆడెల్లు అలియాస్ భాస్కర్ మృతిచెందారు. ఆడెల్లు స్వస్థలం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెర గ్రామం. భాస్కర్ కేంద్ర కమిటీతోపాటు- రాష్ట్ర కమిటీకి కార్యదర్శిగా పని చేస్తున్నారు. అతి తక్కువ సమయంలోనే రాష్ట్ర కమిటీ స్థాయికి భాస్కర్ ఎదిగారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల రిక్రూట్‌మెంట్‌లో ఆయన కీలక పాత్ర పోషించారు. అతడి తలపై రూ.25లక్షల రివార్డు ఉంది. ఈ ఎన్‌కౌంటర్ జరిగిన ఘటనా స్థలంలో ఏకే 47తోపాటు పలు ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సమాచారం. కాగా మావోలు, భద్రతా దళాల మధ్య ఇంకా ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. గురువారం నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ భద్రతా బలగాలకు సమాచారం అందింది. దీంతో ఈ ప్రాంతంలో భద్రతా బలగాలు, పోలీసులు కూంబింగ్ చేపట్టాయి. ఈ విషయాన్ని మావోయిస్టులు పసిగట్టారు. కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. దీంతో వారు ఎదురుకాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత సుధాకర్ మరణించారు. అతడి తలపై రూ. కోటి రివార్డు ఉన్న సంగతి తెలిసిందే. ఇదే ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టు సైతం మృతిచెందిన విషయం విదితమే. ఇదే ప్రాంతంలో భారీగా ఆయుధాలను సైతం భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరోవైపు వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్‌లలో ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతి చెందారు. అలాగే ప్రభుత్వం ఎదుట మరికొంతమంది మావోయిస్టులు లొంగిపోయారు. ఇంకొంతమంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

# రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసు

**న్యూఢిల్లీ:** బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ చేసిన రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసులో సుప్రీం నోటీసులిచ్చింది. కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంలో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందంటూ కేటీఆర్ గతంలో ఆరోపణలు చేశారు. దీంతో కేటీఆర్ చేసిన ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ.. ఉట్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేత ఫిర్యాదుతో కేటీఆర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని గతంలోనే కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న హైకోర్టు.. కేటీఆర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టి వేస్తూ తీర్పు ఇచ్చింది. అయితే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుగుణ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం విచారణ జరుగగా.. పిటిషన్‌పై సమాధానం చెప్పాలంటూ కేటీఆర్‌కు సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

# నీట్- 2025 ఎంట్రన్స్ టెస్ట్ వాయిదా



**న్యూఢిల్లీ:** నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ నీట్- 2025 పరీక్షను వాయిదా వేయాలన్న నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అభ్యర్థనకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఆమోదం తెలిపింది. జూన్ 15వ తేదీన జరగాల్సిన పరీక్షను ఆగస్టు 3వ తేదీన నిర్వహించేందుకు అనుమతి ఇచ్చింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయమూర్తి పీకే మిశ్రా నేతృత్వంలోని బెంచ్.. పరీక్ష వాయిదాపై కేంద్రాన్ని, ఎన్‌బీఈని ప్రశ్నించింది. 'ఇంకా రెండు నెలలు పరీక్షను వాయిదా వేయటం ఎందుకు..జులై రెండు లేదా మూడో వారంలో పరీక్ష నిర్వహించవచ్చుగా' అని అడిగింది. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ స్పందిస్తూ..' లాజిస్టికల్ సవాళ్ల కారణంగా పరీక్ష వాయిదా పడింది. పరీక్ష కేంద్రాల సంఖ్యను రెట్టింపు చేయడం, కఠినమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టడం వంటి వాటి కోసం ఈ నిర్ణయం తీసుకోవటం జరిగింది. చిన్న పొరపాట్లు- పరీక్ష ప్రక్రియపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే పరీక్షను వాయిదా వేయడానికి ఎన్బీఈ నిర్ణయించిందని తెలిపారు.అనంతరం న్యాయమూర్తి మిశ్రా మాట్లాడుతూ.. ' పరీక్ష ఎప్పుడు జరిగినా నిష్పక్షపాతంగా, సమగ్ర భద్రతతో జరగాలని స్పష్టం చేశారు. గత వారం ఇచ్చిన తీర్పును కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. అప్పటి నుంచి మీరు ఏం చేశారంటూ ఎన్‌బీఈని ప్రశ్నించింది. దీనిపై ఎన్‌బీఈ మాట్లాడుతూ.. ' పరీక్ష విషయంలో మేము ఏమాత్రం రాజీ పడదలచుకోవడం లేదని స్పష్టం చేసింది. కాగా, నీట్ పీజీ పరీక్షను రెండు షిఫ్టుల్లో జరపడానికి పర్మిషన్ కోరుతూ ఎన్‌బీఈ గతంలో సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దానిపై విచారణ జరిపిన కోర్టు ఎన్‌బీఈ ప్రతిపాదనను తోసిపుచ్చింది. రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరిగితే విద్యార్థులపై చెడుగా ప్రభావం చూపే అవకాశం ఉందని అభిప్రాయపడింది. దేశ వ్యాప్తంగా ఒకే షిఫ్టులో పరీక్ష పెట్టాలని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే పరీక్ష ఒకే షిఫ్టులో జరపడానికి మరింత సమయం కావాలని బోర్డు కోరింది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన కోర్టు ఆగస్టు 3వ తేదీన పరీక్ష జరపడానికి అవకాశం కల్పించింది. ఒకే షిఫ్ట్‌లో పరీక్షను ముగించాలని ఇటీవల అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పరీక్ష నిర్వహణ తేదీని జూన్ 15 నుంచి మార్చుకునేందుకు వీలు కల్పించింది.

వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే జాతీయస్థాయి అర్హత పరీక్ష (నీట్)కు సంబంధించి ఇటీవల సుప్రీంలో విచారణ జరిగింది. పరీక్షను రెండు షిఫ్టులలో నిర్వహించడానికి నిరాకరించింది. దానివల్ల కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంది. పరీక్ష నిర్వహణలో పూర్తి పారదర్శకతను పాటించాలని, సురక్షితమైన పరీక్షా కేంద్రాలనే ఎంచుకోవాలని సూచించింది. రెండు ప్రశ్నపత్రాలు ఎప్పటికీ ఒకేవిధమైన కాఠిన్య లేదా సులభ స్థాయిని కలిగిఉండవని అభిప్రాయపడింది. పోటీ- తీవ్రత దృష్ట్యా ప్రతి మార్కు ర్యాంకు నిర్ధరణలో అత్యంత కీలకమేనని తెలిపింది. నార్మలైజేషన్ విధానాన్ని కొన్ని ప్రత్యేక కేసుల్లో మాత్రమే అనుసరించాలని, ప్రతి ఏడాదీ నిర్వహించుకొనే పరీక్షకు అది సరికాదని ధర్మాసనం పేర్కొంది.

# బనకచర్లపై బిఆర్ఎస్ తరపున సుప్రీంలో కేసు వేస్తాం



సిద్దిపేట: అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డి అనుకున్నం, కానీ ఆయన్ని మించి తాత అయ్యిండు ఉత్తమ్ కుమార్ రెడ్డి అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఉత్తమ్ అబద్దాలు చూస్తే గోబెల్స్ అనేవాడు ఉంటే ఉరి పెట్టుకునేవాడు అని హరీశ్‌రావు అన్నారు. దుబ్బాకలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు- బీజేపీ ఎంపీలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ సమావేశం నిరాశపరిచిందని మాజీ మంత్రి హరీష్ రావువ్యాఖ్యలు చేశారు. ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. గాలి మోటార్‌పై తిరుగుతూ గాలి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక్క డీఏ ఇచ్చేందుకు ముచ్చటగా మూడు కమిటీలు వేశారని... దీనికి కేబినెట్‌లో అయిదు గంటల చర్చ చేశారని వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిట్ట నిలువునా ముంచుతోందన్నారు. తక్షణమే మూడు డీఏలు చెల్లించాలని బీఆర్‌ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఉద్యోగస్తులపై సర్కార్ కేసులు పెడుతోందన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి గ్రామాల్లో పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మించిపోయారని వ్యాఖ్యలు చేశారు. ఉత్తమ్ కుమార్ ఏది మాట్లాడినా అబద్దమే అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో క్రాప్ హాలిడే ప్రకటించిందన్నారు.

65 టీఎంసీల నీటిని ఉపయోగించకుండా చేసింది ఉత్తమ్ అంటూ ఆరోపించారు. నీతి ఆయోగ్ మీటింగ్‌లో ప్రధానిని రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. గోదావరి బనకచర్ల కోసం బీఆర్‌ఎస్ పార్టీ సుప్రీంకోర్టు వెళ్తుందన్నారు. గోదావరి బనకచర్ల మీద బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. శ్రీశైలం రైడింగ్ ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును ఉత్తమ్ కుమార్ రెడ్డి అడ్డుకోవాలన్నారు. కాళేశ్వరం కుప్ప కూలిందని చెప్పే రేవంత్ రెడ్డి గంధమళ్ళకు నీళ్లు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. కాళేశ్వరం కూలిందని కాంగ్రెస్ ప్రభుత్వం గ్లోబల్ ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను స్టే తెచ్చి ఆపిందే బిఆర్ఎస్, కేసీఆర్ అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి విజయవాడకు పోయి చంద్రబాబును కలిసి బజ్జీలు తిని వచ్చిండు. అప్పటి నుంచి ఏం మాట్లాడటం లేదు. కృష్ణా నది జలాల్లో రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు వాడనంత తక్కువ నీళ్లు వాడింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆంధ్రాకు దాసోహం చేసి, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్ నగర్‌లో పంటలను ఎండబెట్టింది కాంగ్రెస్. తాత్కాలిక కేటాయింపుల ప్రకారం, 65 టీ-ఎంసీలు తక్కువ వాడిన చేతగాని దద్దమ్మ ప్రభుత్వం. ఆరున్నర లక్ష ఎకరాలకు నీళ్లు ఇవ్వకపోవడమే, పంట ఎండబెట్టడమే. దీనికి సమాధానం చెప్పు, చెంపేలేసుకొని ముక్కు భూమికి రాయి ఉత్తమ్ కుమార్ రెడ్డి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కేబినెట్‌లో బనకచర్ల గురించి మాట్లాడేందుకు సమయం లేదా? ఇంతకంటే ముఖ్యమైన అంశం ఇంకోటి ఉంటదా? ఐదు గంటలు కమిషన్లు, పర్సెంటీజీలు, హైకమాండ్‌కు పంపే మూటల గురించి మాట్లాడారా? 400 టీఎంసీల గోదావరి జలాలను అక్రమంగా ఏపీ తరలిస్తుంటే గుడ్లు అప్పగించుకొని చూస్తారా? సుప్రీం కోర్టుకు వెళ్లరా, కేంద్ర మంత్రిని కలవరా, నీతి అయోగ్‌లో సీఎం ఎందుకు మాట్లాడలేదు. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. అపెక్స్ కమిటి అనుమతి లేకుండా, అంతర్ రాష్ట్ర అనుమతి లేకుండా, గోదావరి ట్రిబ్యునల్ అనుమతి లేకుండా ప్రాజెక్టు కడుతుంటే ఎందుకు మౌనం. చంద్రబాబును ఎదురించే దమ్ము సత్తా లేదా, ఎందుకు లాగులు తడుస్తున్నాయి. ఎందుకు సుప్రీం కోర్టుకు వెళ్లరు, ఎందుకు ప్రధానిని ప్రశ్నించరు. బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. పూర్తిగా ఏపీకి దాసోహం అయిపోయారు. రాష్ట్రం స్పందించకుంటే సుప్రీం కోర్టుకు బిఆర్ఎస్ వెళ్తుందని చెప్పినం. ఇప్పటికీ ఆ మాటకు కట్టు-బడి ఉన్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. లేఖలు రాసి చేతులు దులుపుకుంటన్నారు. అఖిల పక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకువెళ్లాలి, జంతర్ మంతర్ వద్ద ధర్నా చేద్దాం పదండి. కృష్ణా నదిలో న్యాయమైన వాటా కిందకి వదిలింది మీరు, గోదావరి బనకచర్ల కడుతుంటే చేతులు కట్టు-కొని చూస్తున్నది మీరు, శ్రీశైలం రైట్ కెనాల్ లైనింగ్ జరుగుతుంటే ఆపకుండా చూస్తున్నది మీరు, బిఆర్ఎస్ లైనింగ్ పనులు ఆపిస్తే ఇప్పుడు మీరు వచ్చాక మొదలు పెట్టారు. తక్షణం ఆ పనులను నిలిపి వేయించాలని డిమాండ్ చేసారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే బిజేపీ పెదవి విప్పడం లేదు. గోదావరి బనకచర్ల మీద బిజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదు. రాష్ట్ర ప్రయోజనాలు బిజెపికి పట్టవా? బనకచర్ల ద్వారా తెలంగాణ గోదావరిలో వాటా కోల్పోయే పరిస్థితి? శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ పూర్తి అయితే రోజుకు 90వేల క్యూసెక్కుల చొప్పున తరలిస్తారు. బిజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కండ్లు తెరవండి. ఏపీ నీటి దోపిడిని అడ్డుకోవాల్సిన కేఆర్ఎంబీ చంద్రబాబు అడుగులకు మడుగులు ఒత్తుతున్నది. శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ అక్రమ పనులు ఆపడం లేదు?

గోదావరి బనకచర్ల అక్రమ ప్రాజెక్టును ఆపడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. గంధమల్ల ప్రాజెక్టు అంటే కాళేశ్వరంలో అంతర్భాగం. కాళేశ్వరం కూలితే గంధమల్లకు నీళ్లు ఎలా వస్తాయి రేవంత్ రెడ్డి. గంధమల్లకు ఎట్ల కొబ్బరి కాయ కొడుతున్నవు. గంధమల్ల, మల్లన్నసాగర్, రంగనాయర్ సాగర్, మిడ్ మానేర్, ఎల్లంపల్లి.. ఇదంతా కాళేశ్వరం కాదా రేవంత్ రెడ్డి. కుప్పకూలింది అని ప్రచారం చేసావు. కాళేశ్వరం కూలితే గంధమల్లకు గోదావరి జిలాలు ఎట్ల వస్తాయి. నువ్వు ఇన్ని రోజులు చేసిన ప్రచారం శుద్ద తప్పు అని తేటతెల్లమైంది. నువ్వు చేసింది అదంతా గోబెల్స్ ప్రచారం అరని తేలిందన్నారు. మూసీలో గోదావరి నీళ్లు పోస్తా అంటవు, ఎట్ల సాధ్యమైతది రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.


# కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలి



హైదరాబాద్: కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలని.. రిపోర్ట్ విషయంలో తాత్సారం చేస్తే వదిలే ప్రసక్తి లేదని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. కాళేశ్వరం విచారణ అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. కంఠంపై తుపాకీ పెట్టినా ఈటెల నిజమే మాట్లాడుతారని స్పష్టం చేశారు. ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు డిజైన్లు, నిర్మాణంతో సంబంధం ఉందా అని కమిషన్ అడిగిందని.. తనకేం సంబంధం లేదని చెప్పానన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్‌పై అధికారం ఉండేదా అని అడగ్గా.. తనకు ఎలాంటి అధికారం లేదని చెప్పినట్లు తెలిపారు. కాళేశ్వరం నిర్మాణం క్వాలిటీ- గురించి ఇంజనీర్లు చూసుకోవాలని.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హరీష్ నాయకత్వంలో కేబినెట్ సబ్ కమిటీ వేశారన్నారు. మంత్రివర్గ ఉపసంఘం, సీడబ్ల్యూసీ రిపోర్ట్ ఆర్థిక శాఖ ముందు పెట్టారని తెలిపారు. నిజాయితీగా ఉండాలని కోరే పార్టీ బీజేపీ అని ఎంపీ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు సృష్టికర్త కేసీఆర్ అని ఆయనే చెప్పుకున్నారని.. ప్రాజెక్టు కట్టాలనే ఆలోచన ఆనాటి ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. కాళేశ్వరంపై నిర్ణయం తీసుకుంది కేసీఆర్ అని.. అప్పుడు ఆయనే బాస్ అన్నారు. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ పార్టీలో ఉన్నా విలువలతో ఉన్నట్లు తెలిపారు. తెలంగాణలో మొట్టమొదటి ఆర్థిక మంత్రిగా పనిచేశానన్నారు. తెలంగాణ సాధించుకుంది నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసమని చెప్పారు. 2006లో తుమ్మిడిహట్టి రూ.16 వేలు ఉంటే 2015లో రూ.38 వేల కోట్లకు పెరిగిందన్నారు. తుమ్మిడిహట్టి దగ్గర కట్టాలని అనుకున్నా మహారాష్ట్ర ఒప్పుకోలేదన్నారు. మూడు బ్యారేజీలు సీడబ్ల్యూసీ రిపోర్ట్, టెక్నికల్ కమిటీ- ఆధ్వర్యంలో కట్టారన్నారు. మూడు బ్యారేజీలు సబ్ కమిటీ, టె-క్నికల్ కమిటీ రిపోర్టు ఆధారంగా కట్టారని వెల్లడించారు. మొదట రూ.63వేల కోట్ల అంచనాతో ప్రారంభం అయితే.. రైతుల డిమాండ్ మేరకు రూ.82 వేల కోట్లకు పోయిందన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్ ఏ పర్పస్ కోసం పెట్టారని కమిషన్ ప్రశ్నిస్తే.. కాళేశ్వరం కార్పొరేషన్‌కు ఫైనాన్స్ శాఖకు సంబంధం లేదని చెప్పినట్లు తెలిపారు. 'మా బతుకులో నిబద్ధతతో ఉంది... నా గొంతుపై తుపాకీ పెట్టినా నిజాలే మాట్లాడతా. ఎవరు పిలిచినా ఎక్కడైనా నిజాలే చెప్తా. కొందరు బట్టకాల్చి మీదేస్తే నాకేమీ కాదు' అని అన్నారు. మూడు బ్యారేజీలు రూ.10వేల కోట్ల లోపే అని చెప్పారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌ను త్వరగా బయటపెట్టాలని.. నిజమైన దోషులు ఎవరో ప్రభుత్వం తేల్చాలని రాజేందర్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం

ప్రాజెక్ట్ అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. శుక్రవారం బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓపెన్ కోర్టులో ఈటెలతో అంతా నిజమే చెప్తానని కమిషన్ ప్రమాణం చేయించింది. అనంతరం కమిషన్ ప్రశ్నలు సంధించింది. కమిషన్ ముందు 113వ సాక్షిగా మాజీ మంత్రి హాజరయ్యారు. దాదాపు 40 నిమిషాల పాటు- విచారణ సాగింది. బ్యారేజీల నిర్మాణం, కాలేశ్వరం కార్పొరేషన్, డీపీఆర్‌పై మొత్తం 19 ప్రశ్నలను కమిషన్ సంధించింది. కేబినెట్ నిర్ణయం తీసుకున్న తర్వాతే మూడు బ్యారేజీల నిర్మాణం మొదలుపెట్టామని చెప్పారు. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ఒప్పుకోలేదని తెలియజేశారు. మహారాష్ట్ర ఒప్పుకోకపోవడంతో 150 నుంచి 148 కుదించామన్నారు.

# కాశ్మీర్‌లో మరో అద్భుతం ఆవిష్కరణ



శ్రీనగర్:ప్రపంచంలోనే ఎత్తైన చినాబ్ రైల్వే వంతెనను ప్రధాని మోడీ అట్టహాసంగా ప్రారంభించారు. ఆపరేషన్ సిందూర్ తరవాత తొలిసారిగా ప్రధాని మోడీ కాశ్మీర్‌కు వెళ్లారు.శుక్రవరాం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జమ్ము కశ్మీర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ కేంద్రం ఎంతో ప్రతిష్మాత్మకంగా నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి చీనాబ్ రైలు వంతెనను ప్రధాని ప్రారంభించారు. జెండా ఊపి రైల్వే వంతెనపై రాకపోకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే బ్రిడ్జిపై పరుగులు తీసిన కోచ్‌లో ప్రధాని ప్రయాణించారు. ఆయన వెంట కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా కూడా ఉన్నారు. భారత దేశం మరో అద్భుత కట్టడానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మాణం జరిగింది. చీనాబ్ రైల్వే బ్రిడ్జిగా పిలువబడుతున్న ఈ బ్రిడ్జి శుక్రవారం ఉదయం ప్రారంభం అయింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం ఉదమ్‌పూర్.. శ్రీనగర్.. బారాముల్లా రైల్ లింక్ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు.. ఈ చినాబ్ రైల్వే వంతెన ఈఫిల్ టవర్ కంటే ఎత్తుగా ఉంటుంది. ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెన చినాబ్ సొంతం. అలాంటి రైల్వే వంతెనను ప్రధాని మోడీ శుక్రవారం జాతికి అంకింతం చేశారు. రూ.46వేల కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ రైలును కూడా జెండా ఊపి ప్రారంభించారు. వంతెన కారణంగా ఈ మార్గం ప్రధానంగా పర్యాటరంగాన్ని మరింత ఆకర్షించనుంది. శ్రీ మాతా వైష్ణో దేవి ఆలయాన్ని వందలాది మంది యాత్రికులు దర్శిస్తుంటారు. ఈ రైల్వే వంతెన ప్రారంభంతో పర్యాటకరంగంగా మరింత పుంజుకోనుంది. ఈ చినాబ్ బ్రిడ్జి 1,315 మీటర్లు విస్తరించి ఉంది. కఠినమైన వాతావరణాన్ని కూడా ఈ వంతెన తట్టు-కోగలదు. ఈ ప్రాంతం భూకంపం జోన్ 5లో ఉంది. ఇంజనీర్లు అత్యంత అద్భుతంగా ప్రణాళికలు వేసి ఈ బ్రిడ్జిని నిర్మించారు. గంటకు 260 కిలోమీటర్ల వేగంతో ప్రచండమైన గాలులు వీచినా ఈ వంతెనకు ఏం కాదు. బలమైన గాలులు తట్టుకునే విధంగా నిర్మించారు. ఇక వంతెన నిర్మించడానికి దాదాపు 30,000 టన్నుల ఉక్కును ఉపయోగించారు. ప్రస్తుతం ఇదే ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెనగా నిలుస్తుంది. చీనాబ్ వంతెన నిర్మాణం 2002లో వాజ్‌పేయ్ హయాంలో ప్రారంభించగా 2022లో మోడీ హయాంలో పూర్తయ్యింది. ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు మార్గం ప్రాజెక్టులో భాగంగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి విజయవంతంగా ముగించారు. శనివారం నుంచి

శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా రైల్వే స్టేషన్ నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ రైళ్లు పరిగెత్తనున్నాయి. ప్రధాని ప్రారంభించిన చీనాబ్ రైల్వే బ్రిడ్జి ప్రత్యేకతల విషయానికి వస్తే.. ఇది ఈఫిల్ టవర్ కంటే చాలా ఎత్తైనది. ఈఫిల్ టవర్ ఎత్తు 330 మీటర్లు మాత్రమే. కానీ, ఈ బ్రిడ్జి ఏకంగా 359 మీటర్ల ఎత్తులో ఉంది. ఈ బ్రిడ్జి పొడవు 1,315 మీటర్లు. కట్టింగ్ ఎడ్జ్ ఇంజనీరింగ్ టెక్నాలజీతో దీన్ని నిర్మించారు.

ఉత్తేజిత దినపత్రిక


# ఎమ్మిగనూరు నియోజకవర్గంలో డీఎస్సీ

## పరీక్షలు రాస్తున్న అభ్యర్థులందరికీ ఆల్ ద బెస్ట్ తెలిపిన డా.జయానాగేశ్వర్ రెడ్డి

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**




ఎమ్మిగనూరు జూన్ 6 శుక్రవారం నియోజకవర్గ శాసనసభ్యులు ఎన్నికల ప్రచార సమయంలో తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన DSC హామీని నెరవేర్చుకున్న బాబు .ఎన్నికల ప్రచార సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబునాయుడు నిరుద్యోగ సమస్యను రూపుమాపాలనటువంటి సదుద్దేశంతో మరియు ఉపాధ్యాయ శాఖలో ఖాళీగా ఉన్నటువంటి పోస్టులను భర్తీ చేస్తామని స్పష్టం చేయడం జరిగింది.. అయితే దీనిలో భాగంగా తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టి సంవత్సరము తరువాత డీఎస్సీ అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు మరియు విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు గారు సంయుక్తంగా డీఎస్సీ అభ్యర్థుల పట్ల సమాలోచనలు చేసి డీఎస్సీ పరీక్షలు నేటి నుండి ప్రారంభం కావడం జరిగింది. కాబట్టి ఇచ్చిన ప్రతి హామీని బాబు కచ్చితంగా నెరవేరుస్తారు అందుకే బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ . ఎమ్మిగనూరు నియోజకవర్గంలో డీఎస్సీ పరీక్షలు రాస్తున్నటువంటి ఎస్జీటీ స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులందరికీ ఆల్ ద బెస్ట్ చెబుతూ .. డీఎస్సీ పరీక్షల్లో ప్రతి ఒక్క క్యూస్షన్ క్షుణ్ణంగా చదివి అర్థం గా చేసుకుని డీఎస్సీ రాసి డిఎస్సి ఉద్యోగాన్ని సంపాదించాలని ప్రతి ఒక్క డీఎస్సీ అభ్యర్థికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

# B. ఉరుకుంద ఏపీఎస్ఆర్టీసీ కండక్టర్ కుమార్తె వివాహానికి ఆర్టీసీ స్టాఫ్

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

ఎమ్మిగనూరు జూన్ శుక్రవారం ఏపీఎస్ఆర్టీసీ డిపో నుండి సుమారుగా 40 మంది ఉద్యోగులు జిల్లల బుడకల గ్రామానికి వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మద్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి ముస్తాక్ , మరియు ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎం శ్రీనివాసులు ఉద్యోగులంతా పాల్గొని కండక్టర్ ఉరుకుంద కుమార్తెను ఆశీర్వదించి ఆతిథ్యం స్వీకరించి కండక్టర్ ఉరుకుంద తన కుమార్తె వివాహంతో మొదటి విజయాన్ని సాధించాలని ఆయనకు శాలువాతో సత్కరించి ఆనందపరిచారు.



## ఎమ్మిగనూరులో టీడీపీకి షాక్ ఇప్పటికే దయాసాగర్ పార్టీకి గుడ్‌బై చెప్పారు ఆయన బాటలో మరి కొందరు ఉన్నట్టు సమాచారం

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

లిఎమ్మిగనూరులో జూన్ 6 శుక్రవారం టీడీపీకి చుక్కెదురవుతోంది. పార్టీకి నిబద్ధతతో పనిచేసిన కౌన్సిలర్ దయాసాగర్ ఇప్పటికే పార్టీకి రాజీనామా చేశారు. ఆయన బాటలోనే మరికొందరు నేతలు కూడా టీడీపీకి గుడ్‌బై చెప్పే యోచనలో ఉన్నారు. నందవరం మండలంలోని కీలక నాయకులు కూడా పార్టీకి అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం.పార్టీకి అనుభవం, నిబద్ధతతో పనిచేసిన వారిని పక్కనబెట్టి, గెలిచాక అధికారం కోసం వచ్చిన వారికే ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ఈ అసంతృప్తి చెలరేగిందని పార్టీ వర్గాల్లో చర్చ. పార్టీని నమ్మి కష్టపడ్డవారిలో తీవ్ర నిరాశ నెలకొంది.
ఉత్తేజిత దినపత్రిక ప్రత్యేక కథనం



# స్మశాన వాటిక భూమి మీదుగా ప్రైవేట్ వ్యక్తులకు రహదారి ఏర్పాటుకోరకై ఆమోదించిన తప్పుడు తీర్మానం రద్దు కోరుతూ.. కలెక్టర్ కు సిఫారసు లెటర్ వెంటనే పెట్టాలంటూ...

**స్మశాన వాటికలో అత్యవసర మౌలిక వసతులను ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలంటూ మున్సిపల్ కమిషనర్ గారిని ఆదేశించిన.....MLA .BV%.జయనాగేశ్వర రెడ్డి**



కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి ఎమ్మిగనూరు జూన్ 6 శుక్రవారం హిందూ రుద్ర స్మశాన వాటిక భూమి సర్వేనెంబర్ 183/%B% మీదుగా ప్రైవేట్ వ్యక్తులకు రహదారి ఏర్పాటు కొరకై ఆమోదించిన తప్పుడు తీర్మానం నెంబర్ 485 పైన మరియు స్మశాన వాటిక భూమి ఆక్రమణలకు సంబంధించిన అంశాలపైన గత ఆదివారం హిందూ స్మశాన వాటిక భూమి దగ్గరకు వచ్చి వాస్తవ పరిశీలన చేసిన మన స్థానిక ఎమ్మెల్యే %డీఎ% జయనాగేశ్వర రెడ్డిగారి ఆధ్వర్యాన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈరోజు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి గారి సమక్షంలో హిందు రుద్ర స్మశాన వాటిక పరిరక్షణ కమిటీ నాయకులైన లచ్చన్న,గణేష్, కొండయ్య,వడ్డే బజారి,పాండురంగ స్వామి, వాల్మీకి రామకృష్ణ, రామకృష్ణ, బుడుగు జంగాల పెద్దయ్య, జగ్గాపురం చిన్న ఈరన్న,నారాయణ, టీ స్టాల్ చంద్ర, మంగళ గిడ్డయ్య, రామస్వామి, మెకానిక్ బీరప్ప లతో కలసి హిందూ స్మశాన వాటిక భూమి ఆక్రమణ సమస్యలపై "సమీక్ష సమావేశం" నిర్వహించడం జరిగింది.ఈ సమీక్ష సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ... స్మశాన వాటిక భూమి మీదుగా రహదారి కొరకు చేసిన తీర్మానం రద్దు కోరుతూ..కలెక్టర్ గారికి సిఫారసు లెటర్ ను వెంటనే పంపాలని కమిషనర్ గారిని ఆదేశించారు.స్మశాన వాటిక భూమిలో ఉన్న ప్రస్తుత ఆక్రమణలను వెంటనే తొలగించి,భవిష్యత్తులో స్మశాన భూమి పరిరక్షణ నిమిత్తం స్మశాన వాటిక స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని, అలాగే స్మశాన భూమి సర్వే నెంబర్లతో కూడిన స్కెచ్ ను కనబరుస్తూ.. అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయటం మరియు గ్రీన్ ప్యాచ్ ఏర్పాటు మొదలైన అత్యవసర మౌలిక వసతులను ఏర్పాటు చేయుటకు తగు చర్యలు వెంటనే తీసుకోవాలని కమిషనర్ గారిని ఆదేశించడం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులు మరియు పరిరక్షణ సమితి నాయకులు ఉరుకుంద, యాపిలయ్య, వెంకటేష్, నాగరాజు, లోకేష్,లక్ష్మన్న,రంగన్న, దస్తగిరి,సుంకన్న, తదితరులు పాల్గొన్నారు

# టిటిడి ముఖ్య భద్రతాధికారిని కలిసిన జర్నలిస్ట్ నేతలు

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, జూన్06**

తిరుమల తిరుపతి దేవస్థానముల చీఫ్ విజిలెన్స్, సెక్యూరిటీ ఆఫీసర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మురళీ కృష్ణను ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ నాయకులు కల్లుపల్లి సురేంధర్ రెడ్డి, తిరుపాల్, పరంధామ రెడ్డి, అదేవిధంగా సీనియర్ జర్నలిస్ట్ మబ్బు నారాయణ రెడ్డి, తిరుచానూరు రవి తదితరులు శుక్రవారం కలిసి అభినందనలు తెలియజేసారు. తిరుమల తిరుపతి పవిత్రతను కాపాడే విషయంలో జర్నలిస్టులు అందరూ మీకు సహకరిస్తారని, అదేవిధంగా స్థానిక సీనియర్ జర్నలిస్టుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని అందరం కలిసి టీటీడీ ప్రతిష్టతను మరింత పెంపొందిస్తామని తెలియజేసారు.



# పగడ్బందీగా ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైన డీఎస్సీ పరీక్షలు

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,జూన్ 6**



: శుక్రవారం తిరుపతి పట్టణంలోని అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ వెంకటాపురం నందు ఉదయం 9. 30 గంటలకు ప్రారంభమైన డీఎస్సీ పరీక్షల నిర్వహణ సరళిని, పరీక్ష కేంద్రాలలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్. జిల్లాలో డీఎస్సీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం, త్రాగునీరు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు లను పరిశీలించి పలు సూచనలు చేశారు.. వేసవి ఎండల దృష్ట్యా డీఎస్సీ పరీక్షలు రాసే అభ్యర్థులు ఎటువంటి అస్వస్థకు గురికాకుండా తక్షణం వైద్య సేవలు అందించేందుకు ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కు తావులేకుండా పగడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని పరీక్షల నిర్వహణ సిబ్బందికి జిల్లా కలెక్టర్ సూచించారు. కలెక్టర్ గారి వెంట జిల్లా విద్యాశాఖాధికారి కె వి యన్ కుమార్ ఉన్నారు.

# జూన్ 07 నుండి 11 తేదీ వరకు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,**

జూన్ 06 తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు జూన్ 07 నుండి 11వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఘనంగా జరుగనున్నాయి.ఈ ఉత్సవాల్లో శ్రీ అలమేలు మంగమ్మ పద్మసరోవర తీరంలో పాంచరాత్ర ఆగమపూజలు అందుకుని భక్తులను అనుగ్రహిస్తారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జ్యేష్ఠశుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు రమణీయంగా తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తిప్పలు, సంసార దుఃఖాలు తొలగి, మోక్షం సిద్ధిస్తుంది. పద్మసరస్సులో బంగారు పద్మం నుండి ఆవిర్భవించిన అలమేలు మంగ జీవకోటికి మాతృమూర్తిగా మారి భవజలధిలో మునిగిపోకుండా రక్షించి, సర్వసౌఖ్యాలు ప్రసాదిస్తారని తెప్పోత్సవాల అంతరార్థం.జూన్ 07వ తేదీ మొదటి రోజు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, రెండో రోజు శ్రీ సుందరరాజస్వామి, చివరి మూడు రోజులు శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తారు.తెప్పోత్సవాల్లో భాగంగా జూన్ 07వ తేదీ రాత్రి 7.30 %-% 8.30 గం.ల మధ్య శ్రీకృష్ణ స్వామివారు, జూన్ 08వ తేదీన శ్రీ సుందరరాజస్వామి వారు, జూన్ 09వ తేదీన శ్రీ పద్మావతీ అమ్మవారు నాలుగు మాడ వీధులలో విహరించనున్నారు.జూన్ 10వ తేదీ రాత్రి 8.30 %-% 10.00 గం.ల మధ్య గజ వాహనంపై, 11 తేదీ రాత్రి 8.30 %-% 10.00 గం.ల వరకు గరుడ వాహనంపై అమ్మవారు భక్తులను ఆశీర్వదిం చనున్నారు.జూన్ 14న



ఉత్తరాషాడ నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6.45 గంటలకు ఆలయ మాడ వీధులలో గజ వాహనంపై అమ్మవారు విహరించి భక్తులను అనుగ్రహించను న్నారు .ఆర్జితసేవలు రద్దు :తెప్పోత్సవాల కారణంగా తిరుచానూరు అమ్మవారి ఆలయంలో ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు.ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజు ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు

# శ్రీ నంది కాలేజ్ ప్రతిభ పురస్కారాలకు ఎంపిక



S. Md. AKHIL - Sr. MPC



P. MEGHANA - Sr.MPC EM

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూర్.....జూన్ 7**

నందికొట్కూర్ శ్రీ నంది జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ బద్దుల శ్రీకాంత్ మీడియాకు ఒక ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్‌అధిక మార్కులు సాధించిన ఎస్ఎండి.అఖిల్, ఎస్.సుహానా బేగం, పి. మేఘన, ఎం. నవీన్, ప్రతిభా పురస్కారాలకు ఎంపిక కావడం జరిగింది అన్నారు.విద్యార్థులు తమ లక్ష్యసాధనకు తగిన ప్రణాళికను సిద్ధం చేసుకుని నడవాలన్నారు. ఓటమి చెందినప్పుడు కుంగిపోకుండా ముందుకు సాగాలన్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ శ్రీధర్ రెడ్డి, ప్రిన్సిపల్ , అధ్యాపక బృందం వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శంకర్ రావు, రమణ జి, శివశంకర్, కోటి వెంకటేశ్వర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు



S .SUHANA BEGUM - Sr.BiPC EM



M .NAVEEN - Sr.MPC EM

# నేషనల్ హైవే ప్రారంభం కాకముందే పగుళ్లు



**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు..జూన్ 7**

నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలం కేంద్రం నందు జూపాడు బంగ్లా ఊరు బయట వెళ్లే నేషనల్ హైవే రోడ్డు పనులను పరిశీలించిన యం సిపిఐ(యు), సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీల బృందం. పనులను సందర్శించిన సందర్భంగా సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు. పిక్కిలి వెంకటేశ్వర్లు,యం సిపిఐ (యు) జిల్లా కన్వీనర్ ప్రాతకోట.లాజరస్ మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారులను విస్తరా పనుల్లో భాగంగా కర్నూల్ టు గుంటూరు వరకు నేషనల్ హైవేకు నిధులు మంజూరు చేసిందని ప్రభుత్వ అధికారులు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల నేషనల్ హైవే పనులు ప్రారంభమైన చోట నాణ్యత లేకపోవడం ప్రారంభం కాకముందే జూపాడుబంగ్లా మండలం మీదుగా వెళుతున్న రహదారుల్లో క్వాలిటీ లేకపోవడంతో హైవే పైనుంచి కిందికి నీళ్లు వెళ్లే సైడ్ బెడ్. ఉడిపోవడం రోడ్డు క్వాలిటీ కంట్రోల్ పర్యవేక్షణ లోపం వలన కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేయడంతో రోడ్డు కృంగిపోవడం జరుగుతుంది దీనికి తోడు రోడ్డుకు వేయాల్సినటువంటి మట్టిని నాపరాయితో వేయడం వలన కుంగిపోయే పరిస్థితి వస్తుందన్నారు. ఈమధ్య కాలంలోనే రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి గారు నేషనల్ హైవేను నందికొట్కూరు ప్రాంతంలో సందర్శించిన సందర్భంగా కాంట్రాక్టర్లు అధికారుల పైన ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు అయినా కాంట్రాక్టర్ల పనితీరు మార్పు లేదన్నారు దీనికి తోడు నేషనల్ హైవేలో ప్రారంభమైన ప్రాంతాల్లో గార్గేయపురం దగ్గర ఫ్లై ఓవర్ క్రుంగడం జరిగిందని అదేవిధంగా నాగలూటి, తర్తూరు, పారుమంచాల అంచే దగ్గర ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయారన్నారు. సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయలేకపోవడం వలన నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యేలు,ఎంపీలు కాంట్రాక్టర్లు అధికారుల పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీ ఐ(యు) డివిజన్ కార్యదర్శి ప్రాతకోట.మద్రిస్వామి,సిపిఐ యం,ఎల్ లిబరేషన్ పార్టీ డివిజన్ నాయకులు నరసింహులు,ఏసన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్తేజిత దినపత్రిక

# లోన్లపై కొత్త వడ్డీ రేట్లు..




ఎస్‌బీఐ కీలక ప్రకటన చేసింది. లేటెస్ట్ ఎంసీఎల్‌ఆర్ రేట్లు ప్రకటించింది. ఈ ఎంసీఎల్‌ఆర్‌ను బట్టే లోన్లపై వడ్డీ రేట్లు ఆధారపడి ఉంటాయని చెప్పొచ్చు. జనవరి 15 నుంచే ఈ కొత్త వడ్డీ రేట్లు అమల్లోకి రానున్నాయి. ఏయే ఎంసీఎల్‌ఆర్ ఏ లోన్లకు ముడిపడి ఉంటాయనేది చూద్దాం.

ప్రభుత్వ రంగానికి చెందిన అతిపెద్ద బ్యాంక్.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను సవరించింది. ఇప్పుడు జనవరి 15 నుంచి కొత్త వడ్డీ రేట్లు అమల్లోకి రానున్నట్లు వెల్లడించింది. ఇది 2025 ఫిబ్రవరి 15 వరకు కొనసాగుతాయని తాజాగా బ్యాంక్ తన అధికారిక వెబ్‌సైట్లో వెల్లడించింది. ఎంసీఎల్‌ఆర్ మారితే బ్యాంకులో ఇతర అన్ని రకాల లోన్లపై ప్రభావం పడుతుందని చెప్పొచ్చు. ఇందులో హోం లోన్లు, పర్సనల్ లోన్లు, కార్ లోన్లు వంటివి ఉన్నాయి. అయితే ఫైనల్ రుణ రేట్లు అనేది రుణ గ్రహీత ఆదాయం, జీతం, సిబిల్ స్కోరు ఇతర అంశాల ఆధారంగా మారుతుంటాయని చెప్పొచ్చు. ఎంసీఎల్‌ఆర్ అనేది బ్యాంకులు దాదాపు ప్రతి నెలా ప్రకటిస్తూనే ఉంటాయి. ఇవి పెరగొచ్చు లేదా తగ్గొచ్చు లేదా స్థిరంగా ఉండొచ్చు.

ఎంసీఎల్‌ఆర్ అనేది రుణ ఆధారిత వడ్డీ రేటు. బ్యాంకులు లోన్లపై వసూలు చేసే కనీస వడ్డీ రేటు అన్నమాట. దీని కంటే తక్కువ వడ్డీకి బ్యాంకులు లోన్లు ఇచ్చేందుకు వీలుండదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేట్లను బట్టి ఇది మారుతుంటుంది. రెపో రేటు పెరిగితే బ్యాంకులు ఎంసీఎల్‌ఆర్ పెంచుతుంటాయి. అక్కడ తగ్గిస్తే.. ఇక్కడ కూడా ఎంసీఎల్‌ఆర్ తగ్గుతుందని చెప్పొచ్చు. ఇక ఎంసీఎల్‌ఆర్ పెరిగితే లోన్ వడ్డీ రేట్లు పెరుగుతాయి. అప్పుడు ఎక్కువ ఈఎంఐ కట్టాల్సి వస్తుంది.

2025 జనవరికి సంబంధించి ఎస్బీఐ లేటెస్ట్ ఎంసీఎల్‌ఆర్ రేట్ల విషయానికి వస్తే.. ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ 8.20 శాతం వద్ద ఉంది. 3 నెలల ఎంసీఎల్‌ఆర్ 8.55 శాతంగా ఉంది. 6 నెలల టెన్యూర్‌కు ఎంసీఎల్‌ఆర్ 8.90 శాతంగా ఉంది. ఎక్కువగా ఆటో లోన్లకు లింక్ అయి ఉండే ఏడాది టెన్యూర్ ఎంసీఎల్‌ఆర్ 9 శాతంగా ఉండగా.. రెండేళ్లు, మూడేళ్ల ఎంసీఎల్‌ఆర్ 9.05 శాతం, 9.10 శాతంగా ఉన్నాయి. పర్సనల్ లోన్లు.. రెండేళ్ల టెన్యూర్‌కు ముడిపడి ఉంటాయి. అంటే 9.05 శాతం ఎంసీఎల్‌ఆర్ కాగా.. దీని కంటే కాస్త ఎక్కువ శాతంతో వడ్డీ రేట్లు ప్రారంభమవుతుంటాయి. ఇక ఎస్బీఐ బేస్ రేటు 10.40 శాతంగా ఉంది. బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు వార్షిక ప్రాతిపదికన చూస్తే 15.15 శాతంగా ఉంది. ఎస్బీఐ హోం లోన్ ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు 9.15 శాతంగా ఉంది. కొత్త లోన్లపై హోం లోన్ వడ్డీ రేట్లు ప్రస్తుతం 8.50 శాతంగా ఉంది. ఇతర బ్యాంకుల విషయానికి వస్తే బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంకు, ఐడీబీఐ బ్యాంకు ఎంసీఎల్‌ఆర్ రేట్లను సవరించలేదు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మాత్రం ఎంపిక చేసిన టెన్యూర్లపై 5 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది.

# 5 ఏళ్లకే లక్షను రూ.32 లక్షలు చేసిన స్టాక్..



రియల్ ఎస్టేట్ సెక్టార్‌కి ప్రముఖ కంపెనీ ఆర్డీబీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ పవర్ లిమిటెడ్ స్టాక్ అదరగొట్టింది. గత 5 ఏళ్ల సంవత్సరాల్లో ఏకంగా 3056 శాతం లాభాన్ని అందించి మల్టీబ్యాగర్ స్టాక్ గా నిలిచింది. లక్ష రూపాయల పెట్టుబడిని దాదాపు రూ.32 లక్షలు చేసింది. ఇప్పుడు కొత్త ప్రాజెక్టు అందుకున్నట్లు ప్రకటించిన క్రమంలో ఫోకస్ లోకి వచ్చింది. మరి ఆ స్టాక్ గురించి ఇప్పుడే తెలుసుకుందాం.

స్మాల్ క్యాప్ కేటగిరి రియల్ ఎస్టేట్ సెక్టార్ కంపెనీ ఆర్డీబీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ పవర్ లిమిటెడ్ స్టాక్ అదరగొట్టింది. తమ ఇన్వెస్టర్లను దీర్ఘకాలంలో మిలియనీర్లను చేసింది. ఈ కంపెనీ షేరు గత ఐదేళ్లలో కళ్ళు చెదిరే లాభాలు అందించింది. గత 5 ఏళ్లలో 3056 శాతం లాభాన్ని అందించి మల్టీబ్యాగర్ షేర్లలో ఒకటిగా నిలిచింది. ఒకవేళ 5 ఏళ్ల క్రితం రూ. 1,00,000 పెట్టుబడి పెట్టి షేర్లు కొన్నట్లయితే ఇప్పుడు మీ షేర్ల విలువ దాదాపు రూ. 32 లక్షలు అవుతుంది. ఐదేళ్ల క్రితం రూ. 15.68 వద్ద ఉన్న కంపెనీ షేరు.. ఇప్పుడు రూ. 495 వద్దకు చేరింది.

జనవరి 10, 2025 నాటి దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ టెండర్లలో పాల్గొని రెండు లెటర్ ఆఫ్ అవార్డ్స్ పొందినట్లు కంపెనీ తెలిపింది. మొదటి ప్రాజెక్టులో భాగంగా జార?ండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని డీవీసీ కమాండ్ ప్రాంతంలో వివిధ రకాల బిల్డింగులపై 10 సామర్థ్యం గల గ్రిడ్ కనెక్టెడ్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందు కోసం కావాల్సిన ఎక్విప్మెంట్స్, స్పేర్ పార్ట్స్ సరఫరా చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. రెండో ఒప్పందం (ప్రాజెక్టు)లో భాగంగా ఐదేళ్ల పాటు సోలార్ పీవీ ప్లాంట్ పూర్తి నిర్వహణ, ఆపరేషన్, మెయింటెనెన్స్ చేయాలని తెలిపింది. ఈ ప్రకటన చేసిన క్రమంలో స్టాక్ ఫోకస్‌లోకి వచ్చింది. ఇన్వెస్టర్లు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

కంపెనీ స్టాక్ అవుట్ లుక్ పరిశీలిస్తే ఇవాళ్టి స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో ఆర్డీబీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ పవర్ షేరు 2.04 శాతం లాభపడి రూ. 494.85 వద్ద ట్రేడవుతోంది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ ధర రూ. 612.65, కనిష్ఠ ధర రూ. 78.30గా ఉంది. గత వారం రోజుల్లో ఈ షేరు 1 శాతం, గత నెల రోజుల్లో 8 శాతం నష్టపోయింది. అయితే గత ఆరు నెలల్లో ఈ షేరు 240 శాతం మేర లాభాలు ఇచ్చింది. గత ఏడాదిలోనే ఈ షేరు 468 శాతం మేర పెరిగింది. గత ఐదేళ్లలో 3056 శాతం లాభాన్ని అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 855.27 కోట్లుగా ఉంది. ఈ స్టోరీ కేవలం సమాచారం కోసమే. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు రిస్క్‌తో ఉంటాయి. నష్టభయం ఎక్కువ. పూర్తి వివరాలు తెలుసుకుని, నిపుణుల సలహా మేరకే పెట్టుబడి పెట్టాలి. లేదంటే నష్టపోవచ్చు.

# పాత పన్ను విధానం రద్దు?



కేంద్ర ప్రభుత్వం కొంత కాలంగా కొత్త పన్ను విధానంలోనే ఎక్కువగా మార్పులు చేస్తూ.. టాక్స్‌పేయర్లకు దీనిని ఆకర్షణీయంగా మారుస్తున్న సంగతి తెలిసిందే. దీంట్లోనే పన్ను రేట్లను సరళీకరిస్తూ వచ్చింది. పన్ను రేట్లు ఇక్కడే కాస్త తక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలోనే కొన్నాళ్లుగా మార్పులు చేయని పాత పన్ను విధానాన్ని కేంద్రం రద్దు చేస్తుందన్న అనుమానాలు పెరిగిపోతున్నాయి. నిపుణులు ఏమంటున్నారో చూద్దాం.

భారత్‌లో నిర్దిష్ట ఆదాయ పరిమితి దాటితే పన్ను చట్టంలోని పన్ను శ్లాబులకు అనుగుణంగా టాక్స్ చెల్లించాల్సి ఉంటుందన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం పాత, కొత్త అని రెండు పన్ను విధానాలు ఉన్న సంగతి తెలిసిందే. డీఫాల్ట్‌గా మాత్రం కొత్త పన్ను విధానాన్నే ఉంచగా.. అవసరమైతే పాత పన్ను విధానంలోకి మారొచ్చు. అయితే ఈ క్రమంలోనే ఇప్పుడు 2025, ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌కు ముందు ఈ పన్ను విధానంపై తెగ చర్చ నడుస్తోంది. పాత పన్ను విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయొచ్చన్న అనుమానం పెరుగుతోంది. ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వ వర్గాల నుంచి దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పటికీ.. సంకేతాలు అలానే ఉన్నాయని చెబుతున్నారు నిపుణులు. ఎప్పుడైనా దీనిపై ప్రకటన రావొచ్చన్న చర్చ నడుస్తోంది. 2020 బడ్జెట్ సమయంలోనే కేంద్ర ప్రభుత్వం.. కొత్త పన్ను విధానం లాంఛ్ చేసింది. అయితే పాత పన్ను విధానంలో పన్ను మినహాయింపులు, తగ్గింపులు ఉన్నట్లుగా కొత్త పన్ను విధానంలో లేకపోయినా టాక్స్ రేట్లు మాత్రం దానితో పోలిస్తే కాస్త తక్కువే ఉన్నాయని చెప్పొచ్చు.

అయితే పాత పన్ను విధానంలో పలు పథకాల్లో పెట్టుబడులపై, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై, హోం లోన్ అసలుపై ఇలా వేర్వేరు పెట్టుబడులపై ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80 సహా ఇతర సెక్షన్ల కింద పన్ను తగ్గించుకునేందుకు చాలానే ఆప్షన్లు ఉన్నాయి. అందుకే ఇలాంటి బెనిఫిట్స్ కోరుకునేవారు.. పాత పన్ను విధానంలో కొనసాగుతున్నారు. అయితే ఆకర్షణీయ స్థాయిలో వడ్డీ రేట్లు తక్కువగా ఉన్న క్రమంలో.. ఎక్కువగా కొత్త పన్ను విధానాన్నే ఎంచుకుంటున్నారు. సెక్షన్ 80 కింద గరిష్ఠంగా ఒక ఆర్థిక సంవత్సరంలో రూ. 1.50 లక్షల వరకు టాక్స్ తగ్గించుకోవచ్చు. నిపుణులు మాత్రం ఇప్పుడు పాత పన్ను విధానం రద్దు ఉంటుందన్న వాదనలతో ఎక్కువగా ఏకీభవిస్తున్నారు.

'కొత్త పన్ను విధానానికి కేంద్ర ప్రభుత్వం పక్షపాతంగా వ్యవహరిస్తోంది. కొత్త పన్ను విధానం ప్రకటించిన తర్వాతి నుంచి చూస్తే.. పాత పన్ను విధానంలో ఎలాంటి మార్పులు చేయట్లేదు. ఇక్కడ మినహాయింపుల్ని పెంచట్లేదు. ఆర్థిక మంత్రి ఒక్కసారిగా పాత పన్ను విధానాన్ని పూర్తిగా రద్దు చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని ముంబై బేస్డ్ టాక్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఎక్స్‌పర్ట్ బల్వంత్ జైన్ అన్నారు.

పాత పన్ను విధానాన్ని రద్దు చేయాలన్న ఆలోచన ఏదైనా కేంద్రానికి ఉంటే.. ముందుగానే దీని గురించి ప్రకటన చేస్తే.. దానికి తగ్గట్లుగా ఎక్కువగా పెట్టుబడులు పెట్టే మధ్యతరగతి వారు ఏర్పాట్లు చేసుకుంటారని చెబుతున్నారు విభావంగల్ అనుకులకర ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సిద్ధార్థ్ మౌర్య. ఇంకా..

ఒకవేళ కేంద్రం దశలవారీగా పాత పన్ను విధానం రద్దు చేయాలని చూస్తే.. అప్పుడు కొత్త పన్ను విధానంలోనూ ఏమైనా మినహాయింపులు కల్పించి మధ్యతరగతికి ప్రోత్సాహం కల్పించాలని కోరుతున్నారు ఫిన్‌కార్పిట్ కన్సల్టింగ్ అసోసియేట్ డైరెక్టర్ గౌరవ్ సింగ్ పార్మర్. మరి బడ్జెట్‌లో దీనిపై నిర్మలమ్మ ఏమైనా ప్రకటన చేస్తారో చూడాలి.

# కార్చిచ్చుకు కారణమేంటి..



అమెరికా చరిత్రలో అత్యంత ఘోర విపత్తుగా భావిస్తున్న లాస్ ఏంజెల్స్ కార్చిచ్చు ఇంకా కొనసాగుతూనే ఉన్నది. జనవరి 7న మొదలైన ఈ వైల్డ్ ఫైర్ వారం రోజులు గడుస్తున్నప్పటికీ పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. అగ్నిమాపక సిబ్బంది చిన్నచిన్న మంటలను అదుపులోకి తెస్తున్నా.. పెద్ద అగ్ని కీలలు అదుపులోకి రావడం లేదు.

లాస్ ఏంజెల్స్: అమెరికా చరిత్రలో అత్యంత ఘోర విపత్తుగా భావిస్తున్న లాస్ ఏంజెల్స్ కార్చిచ్చు ఇంకా కొనసాగుతూనే ఉన్నది. జనవరి 7న మొదలైన ఈ వైల్డ్ ఫైర్ వారం రోజులు గడుస్తున్నప్పటికీ పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. అగ్నిమాపక సిబ్బంది చిన్నచిన్న మంటలను అదుపులోకి తెస్తున్నా.. పెద్ద అగ్ని కీలలు అదుపులోకి రావడం లేదు. బలమైన గాలుల కారణంగా మంటలు మరింత తీవ్రతరం అవుతాయని అంచనావేస్తున్నారు.కాగా, కార్చిచ్చు కారణంగా ఇప్పటివరకు వేలాది ఇండ్లను ధ్వంసమవగా, 25 మంది మృతిచెందారు. దాదాపు 30 మంది తప్పిపోగా వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. సుమారు 30 వేల ఎకరాలకుపైగా ఈ మంటలు వ్యాపించినట్లు తెలుస్తున్నారు. అసలు ఈ కార్చిచ్చుకు కారణం ఏంటి? మంటలు ఎలా అంటుకున్నాయి? దీనివెనుక ఏదైనా కుట్ర దాగి ఉన్నదా? అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాణాలను హరిస్తున్న దావాగ్నిపై ఫెడరల్ విచారణ ప్రారంభమైంది. జోస్ మెడినా ఆధ్వర్యంలో 75 మందితో కూడిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఆల్కహాల్ టొబాకో అండ్ ఫైర్ఆర్మ్స్ బృందం దర్యాప్తు చేపట్టింది. మంటలు ఎలా అంటుకున్నాయనే ప్రశ్నకు సమాధానం కోసం అంతా ఎదురుచూస్తున్నారు. ప్రతిఒక్కరికి సందేహాన్ని తాము తీర్చుతాం. కానీ లోతుగా విచారించిన తర్వాతే జవాబు లభించే అవకాశం ఉంటుందని విచారణ బృందానికి నేతృత్వం వహిస్తున్న జోస్ అన్నారు. ఈనెల 7న లాస్ ఏంజెల్స్‌కు పశ్చిమాన 32 కిలోమీటర్ల దూరంలోని పాలిసేస్‌లో మంటలు అంటుకున్నాయి. లాస్ ఏంజెల్స్ మాత్రమే కాదు, కాలిఫోర్నియాలోని చుట్టుపక్కల నగరాల నుంచి తెప్పించిన ఫైర్ ఇంజిన్లు, హెలికాప్టర్లతో నీటిని గుమ్మరిస్తున్నా మంటలు అదుపులోకి రావడం లేదు. ఇక్కడ 23 వేలకుపైగా ఎకరాల్లో మంటలు అంటుకున్నాయి.బలమైన గాలులు వీస్తుండటంతో లాస్ ఏంజెల్స్‌కు ఉత్తరం వైపున ఈటన్ ప్రాంతానికి మంటలు వ్యాపించాయి. ఇక్కడ కూడా 14 వేల ఎకరాలకు మంటలు అంటుకున్నాయి. శాన్ ఫెర్నాండోకు ఉత్తరాన హస్ట్ అనే చోట కూడా కార్చిచ్చు అంటుకున్నది. ఇక్కడ 800 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఆస్తులు కాలిబూడిదయ్యాయి.

న్యూ ఇయర్ వేడుకల ప్రభావమేనా?

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కాల్చిన బాణసంచా వల్ల కార్చిచ్చు సంభవించినట్లు అనుమానిస్తున్నారు. ఉపగ్రహ ఛాయా చిత్రాలు, రేడియో కమ్యూనికేషన్లు, స్థానికుల కథనాలు ఈ అనుమానాలకు ఊతమిస్తున్నాయి. దీనిపై వాషింగ్టన్ పోస్ట్ ఓ వార్త కథనాన్ని ప్రచురించింది.

దొంగల చేతివాటం... పాలిసేడ్స్‌లో సంపన్నులు నివసిస్తుంటారు. కార్చిచ్చు వల్ల వారు ఇండ్లను వదిలి వెళ్లిపోయారు. దీంతో దొంగలు ఆ ఇండ్లను దోచుకుంటున్నారు. ఓ దొంగ ఏకంగా అగ్నిమాపక సిబ్బంది ధరించే యూనిఫాంతో సంచరించడాన్ని అధికారులు గుర్తించారు.

# క్యాన్సర్ నుంచి బయటపడ్డాను..



బ్రిటన్ యువరాజు విలియం సతీమణి, ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ కేట్ మిడిల్టన్ కీలక ప్రకటన చేశారు. తాను క్యాన్సర్ నుంచి బయటపడ్డట్లు వెల్లడించారు.

బ్రిటన్ యువరాజు విలియం సతీమణి, ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ కేట్ మిడిల్టన్ కీలక ప్రకటన చేశారు. తాను క్యాన్సర్ నుంచి బయటపడ్డట్లు వెల్లడించారు. ఈ మేరకు ఇన్ స్టా వేదికగా పోస్టు పెట్టారు. ఇప్పుడు చాలా ఉపశమనంగా ఉందని, ఇక నుంచి పూర్తిగా కోలుకోవడం పైనే దృష్టిసారించినట్లు తెలిపారు. అయితే సాధారణ స్థితికి రావడానికి ఇంకాస్త సమయం పడుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు విలియమ్‌తో కలిసి ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న క్యాన్సర్ రోగులను పరామర్శించారు. గతేడాది చికిత్స సమయంలో ఆసుపత్రి సిబ్బంది తనను చాలా బాగా చూసుకున్నట్లు కేట్ మిడిల్టన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ మేరకు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. తాను క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ కట్ మిడిల్టన్ గతేడాది మార్చిలో ప్రకటించిన విషయం తెలిసిందే. అనారోగ్యం వల్ల జనవరిలో పొత్తికడుపు శస్త్రచికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. శస్త్రచికిత్స విజయవంతం అయినప్పటికీ ఆ తర్వాత నిర్వహించిన వైద్య పరీక్షల్లో తనకు క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని పేర్కొన్నారు. ఇక అప్పటి నుంచి ఆమె బయటి ప్రపంచానికి కనిపించలేదు. పలు దశల వారీగా కీమోథెరపీ చేయించుకున్నారు.

# ఎట్టకేలకు.. యూన్ సుక్ యేల్ అరెస్ట్



అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. తీవ్ర ప్రతిఘటనల అనంతరం యోల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో దక్షిణ కొరియా చరిత్రలో అరెస్టయిన తొలి అధ్యక్షుడిగా యోల్ నిలిచారు.

సియోల్: అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. తీవ్ర ప్రతిఘటనల అనంతరం యోల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో దక్షిణ కొరియా చరిత్రలో అరెస్టయిన తొలి అధ్యక్షుడిగా యోల్ నిలిచారు. అంతకుముందు బుధవారం తెల్లవారుజామున సియోల్‌లోని అధ్యక్ష భవనం వద్ద నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. యోల్‌ను అరెస్టు చేసేందుకు 3 వేల మందికిపైగా పోలీసులతో యాంటీ కరెప్షన్ ఇన్వెస్టిగేటర్లు ఆయన అధికార నివాసానికి చేరుకున్నారు. అయితే వారిని అధికార పార్టీకి చెందిన నాయకులు, యోల్ మద్దతుదారులు, వ్యక్తిగత సిబ్బంది, సైన్యం పోలీసులతోపాటు విచారణ అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అయితే తీవ్ర ప్రతిఘటనల నడుమ అధ్యక్ష భవనంలోకి ప్రవేశించిన అధికారులు యోల్‌ను అరెస్టు చేశారు. ఓ ఎరుపు రంగు బస్సులో ఆయనను అక్కడి నుంచి తరలించారు. ఆయన్ని ఎక్కడి తీసుకెళ్లారనే విషయాన్ని అధికారులు వెల్లడించలేదు. అయితే యోల్‌ను గవాచియాన్‌లోని కరప్షన్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ కార్యాలయానికి తరలించే అవకాశం ఉన్నది. అక్కడ మార్షల్ లా విధింపు కేసులో విచారణ జరుపనున్నారు. అరెస్టు వారెంట్ నేపథ్యంలో 48 గంటలపాటు ఆయన్ని అదుపులో ఉంచుకునే అధికారం సీఐవోకు ఉంటుంది.

డిసెంబర్ 3న దేశంలో ఎమర్జెన్సీ మార్షల్ లా విధించిన విషయం తెలిసిందే. దీంతో ఆయనపై నేషనల్ అసెంబ్లీ 204-85 ఓట్లతో అభిశంసన తీర్మానాన్ని ఆమోదించింది. మార్షల్ లాను ప్రకటించిన కేసులో విచారణకు సహకరించకపోవడంతో ఆయనపై అరెస్టు వారెంటు జారీ అయింది. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్టు చేసేందుకు అధికారులు ఈ నెల 3 విఫల యత్నం చేశారు. తెల్లవారు జామునే అధ్యక్ష భవనానికి చేరుకున్న అధికారులను సైన్యంతోపాటు ఆయన వ్యక్తిగత సిబ్బంది అడ్డుకున్నారు. ఆరు గంటల పాటు.. అధ్యక్షుడి భద్రతా సిబ్బందితో పోలీసులు వాగ్వాదానికి దిగారు. చివరకు అరెస్టును వాయిదా వేసుకున్న పోలీసులు వెనక్కి మళ్లారు.

# మెటాలో భారీగా ఉద్యోగాల కోత..



ప్రముఖ టెక్ దిగ్గజం మెటాలో భారీగా ఉద్యోగాలకు కోతలు పడనున్నాయి. పనితీరు ఆధారంగా ఉద్యోగులను తొలగించేందుకు రంగం సిద్ధమైంది. తక్కువ పనితీరు కనబరుస్తున్న వారిని గుర్తించారని, వారి స్థానాలను కొత్త వారితో భర్తీ చేయనున్నట్లు బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది.

శాన్‌ఫ్రాన్సిస్కో: ప్రముఖ టెక్ దిగ్గజం మెటాలో భారీగా ఉద్యోగాలకు కోతలు పడనున్నాయి. పనితీరు ఆధారంగా ఉద్యోగులను తొలగించేందుకు రంగం సిద్ధమైంది. తక్కువ పనితీరు కనబరుస్తున్న వారిని గుర్తించారని, వారి స్థానాలను కొత్త వారితో భర్తీ చేయనున్నట్లు బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. మొత్తం 3600 మందిని తొలగించనున్నట్లు తెలుస్తున్నది. మెటా నేతృత్వంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు ఉన్న సంగతి తెలిసిందే. ఆయా సంస్థల్లో గతేడాది సెప్టెంబర్ నాటికి 72,400 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

ఉద్యోగాల కోతలపై మెటా చీఫ్ మార్క్ జుకర్‌బర్గ్ స్పందించారు. పనితీరు సామర్థ్యాన్ని పెంచే క్రమంలో తక్కువ పనితీరును కనబరుస్తున్నవారిని తొలగించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కంపెనీని బలోపేతం చేసేందుకు పని ఆధారంగా కోతలు విధిస్తున్నామని, వారి స్థానంలో కొత్తవారిని తీసుకుంటామని స్పష్టం చేశారు. దీంతో మొత్తం ఉద్యోగుల్లో 5 శాతం మందిపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు.

కాగా, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 20న ప్రమాణస్వీకారం చేయనున్నారు. అంతకుముందే మెటాలో ఉద్యోగుల మార్పులు చేర్పులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ట్రంప్, జుకర్‌బర్గ్ మధ్య విభేదాలు ఉండేవి. 2021లో అమెరికా పార్లమెంటు భవనంపై ట్రంప్ అనుచరులు దాడి చేయడంతో ఆయనను ఫేస్‌బుక్ నుంచి బహిష్కరించిన విషయం తెలిసిందే. 2023లో మళ్లీ ఆయన అకౌంట్‌ను పునరుద్ధరించారు. అయినప్పటికీ మెటా చీఫ్‌పై ట్రంప్ విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. అయితే అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపొందడంతో.. ఆయన యంత్రానికి అనుకూలంగా జుకర్ బర్గ్ నిర్ణయాలు తీసుకుంటున్నారు. గతవారం తన సోషల్ మీడియా వేదికల్లో ఫ్యాక్ట్ చెకింగ్ ఫీచర్‌ను తొలగించారు.

ఉత్తేజిత దినపత్రిక


# రైతు భరోసా డబ్బులు ఎప్పుడిస్తారు..?



## ఆశగా ఎదురు చూస్తున్న అన్నదాతలు

**తెలంగాణ:** వానాకాలం సాగుకు రైతులు సిద్ధమవుతుండగా.. రైతు భరోసా నిధులపై అనిశ్చితి నెలకొంది. గత యాసంగి సాయం అసంపూర్తిగా ఉండటంతో, ఖరీఫ్‌కు కలిపి ఇస్తారా? లేదా అనే సందేహాలు న్నాయి. ఎకరంలోపు పంట సాగు చేస్తున్న సర్వే నంబర్ల సమస్యల వల్ల కొందరికి సాయం అందలేదు. సకాలంలో నిధులు అందకపోతే సాగు పనులు ఆలస్యమై దిగుబడులపై ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే నేటి కేబినెట్ సమావేశంలో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

తెలంగాణలో వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. భూములను దుక్కి దున్ని సిద్ధం చేసుకుని, విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఈసారి వర్షాలు ముందుగానే కురుస్తాయని వాతావరణ శాఖ సూచించడంతో అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే, పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందించే 'రైతు భరోసా' పథకంపై అనేక అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పథకం కింద ఎకరాకు రూ. 12 వేలు రెండు విడతల్లో రూ.6 వేల చొప్పున అందిస్తున్నారు.

గత యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా సాయం ఇప్పటివరకు పూర్తి స్థాయిలో రైతుల ఖాతాల్లో జమ కాలేదు. జనవరి 26వ తేదీ నుంచి ఎకరా, రెండు ఎకరాల చొప్పున విడతల వారీగా ఐదు ఎకరాలలోపు రైతులకు మాత్రమే సాయం అందించారు. ఆ తరువాత నిధుల విడుదల నిలిచిపోయింది. దీంతో, గత యాసంగి సాయం అందని రైతులు, ఈసారి రెండు సీజన్ల (యాసంగి, ఖరీఫ్) సాయం కలిపి ఇస్తారా? లేక ప్రస్తుత ఖరీఫ్‌కు మాత్రమే ఇస్తారా? అనే సందిగ్ధంలో ఉన్నారు. కొందరు రైతులకైతే ఎకరంలో లోపు ఉన్న రైతు భరోసా అందలేదు. సర్వే నెంబర్లలో భూముల లెక్కల తేడా కారణంగా పలువురు రైతులు రైతు భరోసా అందుకోలేదు.

ప్రస్తుతం ఖరీఫ్‌లో పత్తి, కంది, సోయా, వరి, పెసర, జొన్న, మొక్కజొన్న వంటి వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. వీటికి అవసరమైన ఎరువులను సకాలంలో తెప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున.. ఈసారైనా రైతు భరోసా సాయం పూర్తి స్థాయిలో, సకాలంలో అందుతుందా లేదా అని అన్నదాతలు మదనపడుతున్నారు. పెట్టుబడి సాయం సకాలంలో అందకపోతే, సాగు పనులు ప్రారంభించడంలో జాప్యం జరగవచ్చునని ఇది పంట దిగుబడులపై ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ అంశంపై త్వరగా స్పందించి, రైతులకు స్పష్టతనివ్వాలని, సకాలంలో సాయం అందించాలని కోరుతున్నారు.

కాగా, కేబినెట్ సమావేశం కానుంది. ఈ భేటీలో రైతు భరోసా పంట పెట్టుబడి సాయం నిధుల విడుదలపై స్పష్టత వచ్చే ఛాన్స్ ఉంది. ఇప్పటికే నైరుతి రాష్ట్రంలోకి ప్రవేశంచటం, రైతులు పంటల సాగుకు సిద్ధమైన నేపథ్యంలో సాయం విడుదలకు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## ముందే జాగ్రత్తపడ్డ పోలీసులు.. లేదంటే హైదరాబాద్‌లో కూడా

**హైదరాబాద్:** ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గెలుపుతో కర్ణాటకలో సంబరాలు మిన్నంటాయి. అయితే, బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో జరిగిన వేడుకలో తొక్కిసలాట జరిగి 11 మంది మరణించారు, 50 మందికి పైగా గాయపడ్డారు.

ఐపీఎల్2025 విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు నిలిచింది. ఇక ఆర్సీబీ విజయంతో కర్ణాటకలో సంబరాలు అంబరాన్నం టాయి. అభిమానుల ఉత్సాహం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఒక్క కర్ణాటకలోనే కాక.. మిగతా రాష్ట్రాల్లో కూడా ఆర్సీబీ గెలుపు పట్ల పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆర్సీబీ జట్టును సన్మానించేందుకు కర్ణాటక ప్రభుత్వం.. బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో సభ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ వేడుక కాస్త విషాదంగా ముగిసింది.

ఆర్సీబీ జట్టు మెంబర్స్ చిన్నస్వామి స్టేడియా నికి వస్తున్నారని తెలియడంతో.. పెద్ద ఎత్తున అభిమానులు స్టేడియం వద్దకు చేరుకున్నారు. అయితే అధికారులు ఊహించిన దాని కన్నా ఎక్కువ సంఖ్యలో అభిమానులు రావడంతో వారిని నియంత్రించడం పోలీసులకు కష్టంగా మారింది. చివరకు లాఠీ ఛార్జ్ కూడా చేశారు. ఇంత భారీ ఎత్తున అభిమానులు తరలి రావడంతో తొక్కిసలాట చోటు



చేసుకుంది. ఈ ఘటనలో 11 మంది చనిపోగా.. సుమారు 50 మంది వరకు గాయప డ్డారని అధికారులు తెలిపారు. బెంగుళూరులో జరిగినట్లుగానే హైదరాబాద్‌లో కూడా తొక్కిసలాట జరిగేందుకు అవకాశం ఉండేనని.. కానీ పోలీసుల ముందు జాగ్రత్త చర్యల వల్ల పెను ప్రమాదం తప్పిందంటున్నారు. బుధవారం ఆర్సీబీ జట్టు ఐపీఎల్ కప్పు గెలిచిన తర్వాత హైదరాబాద్‌లో కూడా సంబరాలు జరిగాయి. అభిమానులు ట్యాంక్‌బండ్, అంబేద్కర్ విగ్రహం దగ్గర, సచివాలయం, తెలుగుతల్లి చౌరస్తా, ఎన్టీఆర్ మార్గాల్లో రోడ్ల మీదకు వచ్చి గెలుపు సంబరాలు నిర్వహించారు.

బైక్‌ల మీద ఫీట్లు చేస్తూ.. రోడ్ల మీద పెద్ద ఎత్తున బాణాసంచ కాల్చారు. ఆ ప్రాంతాల్లో నిలిచి ఉన్న వాహనాల మీదకు ఎక్కి రచ్చ రచ్చ చేశారు. అతి వేగంతో వాహనాలు నడిపి.. అత్యుత్సాహం ప్రదర్శించారు. దీంతో ముందే అప్రమత్తమైన పోలీసులు ఆయా ప్రాంతాలకు చేరుకుని.. వీరిని చెదరగొట్టారు. ఎక్కువ మంది గుమికూడకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసులు ఇలా వెంటనే స్పందిచడంతో హైదరాబాద్‌లో పెను ప్రమాదం తప్పిందంటున్నారు. లేదంటే బెంగుళూరులో జరిగినట్లే ఇక్కడ కూడా జరిగేది అంటున్నారు. ఇక బెంగళూరులో జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి, ప్రధాన మంత్రితో పాటుగా పలువురు క్రీడా, రాజకీయ ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు కర్ణాటక ప్రభుత్వం 10 లక్షల రూపాయల పరిహారం ప్రకటించింది. ఈ ప్రమాదంలో చనిపోయిన ఓ వ్యక్తి తండ్రి ఆవేదన ప్రతి ఒక్కరిని కదిలి ంచింది. నా కొడుకును ముక్కలు చేయకుండా నాకు అప్పగించండి అంటూ అతడు అధికా రులను వేడుకున్నాడు. ఇక ఈ తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం ఓ కమిటీని వేసింది.

## రేషన్ కార్డు కావాలా.. అయితే రూ.5వేలు కొట్టు!

**తెలంగాణ:** కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఊపందుకుంది. అయితే, కొందరు దీన్ని అదునుగా తీసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ కార్డు కావాలంటే వేలకు వేలు డిమాండ్ చేస్తున్నారట. ఈ దందా వెనుక మీ సేవా కేంద్రాల నిర్వాహకుల హస్తం ఉందని సమాచారం. పేదలు మాత్రం డబ్బుల్లేక రేషన్ కార్డుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తమవుతోంది. హైదరాబాద్‌లో ఈ తరహా వసూళ్ల పర్వం కొనసాగుతోందని ఆరోపణలు వస్తున్నాయి.

తెలంగాణ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ ప్రారంభించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు లభించాలంటే రేషన్ కార్డు కచ్చితంగా ఉండాల్సిందే. తెలంగాణలో దాదాపు దశాబ్దం తర్వాత కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ ప్రారంభించారు. దీంతో చాలా మంది కొత్త రేషన్ కార్డులకు అప్లై చేసుకుంటున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, ఫ్రీ గ్యాస్ సిలిండర్ వంటి పథకాలకు అర్హులు కావాలంటే రేషన్ కార్డు



కచ్చితంగా ఉండాలి. దీంతో చాలా మంది రేషన్ కార్డుకు అప్లై చేసుకుంటున్నారు.

అయితే దీన్ని అదునుగా తీసుకుని.. కొందరు కొత్త దందా మొదలు పెట్టారు. రేషన్ కార్డు కావాలా.. అయితే రూ.5 వేలు కొట్టు అంటూ పేద, మధ్యతరగతి వారిని డిమాండ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఈ నయా దందా జోరుగా సాగుతుందని ఆరోపణలు వస్తున్నాయి.

గ్రేటర్ పరిధిలో కొత్త రేషన్ కార్డుల దందా పెద్ద ఎత్తున కొనసాగుతోంది. ముఖ్యంగా మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, ఆపరేటర్లు ఈ దందా మొదలుపెట్టారని ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ కార్డు త్వరగా రావాలంటే.. కనీసం రూ.3000 నుంచి 5,000 వరకు చెల్లించాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. డబ్బులిస్తే 15 రోజుల్లో విచారణ పూర్తి చేయించి మీ చేతిలో రేషన్ కార్డు పెడతామంటూ వసూళ్లకు పాల్పడుతున్నారు. దీన్ని గుడ్డిగా నమ్మిన జనాలు ఆ మొత్తం చెల్లిస్తున్నారంటూ వార్తలు వస్తున్నాయి.

రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో గత రెండు నెలల కాలంలోనే.. మీ సేవా కేంద్రాల ద్వారా సుమారు 2.66 లక్షల మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. అయితే ఇంత భారీ ఎత్తున రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. క్షేత్రస్థాయి విచారణ పూర్తయిన కార్డుల వివరాలు కేవలం 10 శాతం మాత్రమే ఉన్నాయంటున్నారు. అయితే డబ్బులు ఇచ్చిన వారి దరఖాస్తులనే త్వరగా విచారణ పూర్తి చేసి.. కార్డులు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు వినిస్తున్నాయి.

ప్రభుత్వం ఇప్పటికైనా దీనిపై దృష్టి సారించి.. ఇలాంటి వసూళ్లకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చాలామంది పేదవారు డబ్బులు లేక.. అర్హత ఉండి కూడా రేషన్ కార్డు పొందలేకుండా ఉన్నారని అంటున్నారు.

## 7కే కిలో గోధుములు.. వారికి మాత్రమే..!

**హైదరాబాద్:** రేషన్ కార్డు లబ్ధిదారులకు మూడు నెలలకు సరిపడా సన్నబియ్యం పంపిణీతో పాటు ఒక్కో కార్డుపై 5 కిలోల గోధుమలను రూ.7కే అందిస్తున్నారు. గతంలో రూ.15 వసూలు చేయగా.. ప్రస్తుతం రూ. 7కే కేజీ గోధుమలు ఇస్తున్నారు. అంతకు మించి అధిక ధరలు వసూలు చేస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని సివిల్ సప్లయ్ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇక ప్రస్తుతం కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ జరుగుతోంది. ఇటీవల 2 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతో లబ్ధిదారుల సంఖ్య 3.10 కోట్లకు చేరింది.

హైదరాబాద్ నగరవ్యాప్తంగా రేషన్ షాపుల ద్వారా ప్రస్తుతం మూడు నెలలకు సరిపడా సన్నబియ్యం పంపిణీ చురుగ్గా కొనసాగుతోంది. ఈ సారి ముందస్తు రుతుపవనాల నేపథ్యంలో జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యాన్ని జూన్ నెలలోనే ఒకేసారి తీసుకోవాలని అధికారులు రేషన్ కార్డుదారులకు సూచించారు. దీంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం తీసుకుంటున్నారు.

ఇక హైదరాబాద్ నగరంలో రేషన్‌పై గోధుమలు సైతం పంపిణీ చేస్తున్నారు. ఒక్కో కార్డు మీద 5 కిలోల గోధుమలు అందిస్తున్నారు. కిలో గోధుమలు సబ్సిడీపై రూ.7కే అందిస్తున్నట్లు హైదరాబాద్ డీసీఎస్‌వో రమేష్ స్పష్టం చేశారు. అంతకు మించి ఏ డీలర్ అయినా వసూలు చేస్తే వారి లైసెన్స్‌లను రద్దు చేస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. గతంలో కిలో గోధుమలకు రూ.15 చొప్పున వసూలు చేసేవారు. అయితే లబ్ధిదారుల నుంచి వ్యతిరేకత రావటంతో ప్రస్తుతం రూ. 7కే ఇస్తున్నారు. ఈ నిర్ణయం వినియోగదారులకు ఎంతో ఊరటనిస్తోంది.



ఇక తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవల 2 లక్షల కొత్త రేషన్ కార్డులను సర్కార్ మంజూరు చేసింది. దీంతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 91.83 లక్షలకు చేరుకుంది. కొత్తగా మంజూరైన రేషన్ కార్డులతో కలుపుకొని 3.10 కోట్లకు పైగా లబ్ధిదారు లకు ఆహార భద్రతను కల్పిస్తుంది. కొత్త కార్డుల జారీ ప్రక్రియ మీసేవా కేంద్రాల ద్వారా, ప్రజా పాలన ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి కొనసాగుతోంది.

రేషన్ పంపిణీలో పారదర్శకతను పెంచడానికి, ఇ-పోస్ రసీదులను నెలకు విడిగా (మూడు నెలలకు మూడు రసీదులు) జారీ చేయాలని అలాగే లబ్ధిదారులు ప్రతి నెలకు విడిగా బయోమెట్రిక్ ధృవీకరణ ఇవ్వాలని అధికారులు సూచించారు. రేషన్ సరుకులను అక్రమంగా విక్రయించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. పేదల పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ నిర్ణయాలు లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించడానికి, దళారుల బెడద తగ్గించడానికి దోహదపడతాయని సివిల్ సప్లయ్ శాఖ అధికారులు భావిస్తున్నారు.

## చిలుకూరు బాలాజీ దర్శన వేళలపై గందరగోళం..

**హైదరాబాద్:** చిలుకూరు బాలాజీ ఆలయంలో దర్శన సమయ వేళలపై గందరగోళం నెలకొంది. ఆలయ బోర్డులో ఒక సమయం, సోషల్ మీడియాలో మరో సమయం ఉండటంతో భక్తులు అయోమయానికి గురవుతున్నారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు దర్శనం ఉంటుందని బోర్డులో ఉండగా, సోషల్ మీడియాలో వేరే సమయం చూపిస్తుండటంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఆలయ అధికారులు స్పందించి సరైన సమాచారం అందించాలని భక్తులు కోరుతున్నారు.

హైదరాబాద్‌లోని చిలుకూరు బాలాజీ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. నిత్యం వేలాది మంది భక్తులు ఇక్కడకు వచ్చి బాలాజీని దర్శనం చేసుకుంటారు. ఈ స్వామివారిని వీసా బాలాజీ అని కూడా అంటారు. విదేశాలకు వెళ్లాలని భావించే వారు.. చిలుకూరు బాలాజీ ఆలయంలో 11 ప్రదక్షిణలు చేసి.. మొక్కుకుంటే.. తప్పకుండా వీసా వస్తుందని నమ్ముతారు.

అంతేకాక ఏవైనా కోరికలు తీరాలంటే.. ముందుగా 11 ప్రదక్షిణలు చేసి.. మనసులోని కోరిక గురించి బాలాజీ ముందు కోరుకోవాలి. ఆపై అది నెరవేరిన తర్వాత 108 ప్రదక్షిణలు చేయాలి. ఇక శని, ఆదివారాల్లో భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. నగరం నలువైపుల నుంచి భక్తులు



ఇక్కడకు వచ్చి దర్శనం చేసుకుంటారు. ఇదిలా ఉండగా తాజాగా చిలుకూరి బాలాజీ దర్శన సమమానికి సంబంధించి గందరగోళం నెలకొంది. దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

చిలుకూరు బాలాజీ దర్శన సమయానికి సంబంధించి తీవ్ర గందరగోళం నెలకొని ఉంది. గుడి వద్ద ఏర్పాటు చేసిన బోర్డులో టైమింగ్స్ ఒకలా ఉంటే.. సోషల్ మీడియాలో మరో టైమింగ్స్ ఉన్నాయి. దీంతో భక్తులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బోర్డులో దర్శనం వేళల్లో ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు.. అలానే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అని పేర్కొన్నారు.

**ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బోర్డులో దర్శనం వేళల్లో ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు.. అలానే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అని పేర్కొన్నారు. కానీ సోషల్ మీడియాలో మాత్రం చిలుకూరు బాలాజీ దర్శనం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అని.. అలానే తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దర్శనం చేసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.**

కానీ సోషల్ మీడియాలో మాత్రం బాలాజీ దర్శన సమయానికి సంబంధించి వేరే సమయం చూపిస్తుంది. దీని ప్రకారం.. చిలుకూరు బాలాజీ దర్శనం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అని.. అలానే తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దర్శనం చేసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. చాలా మంది భక్తులు సోషల్ మీడియాలో వస్తోన్న దర్శనం వేళలే కరెక్ట్ అనుకుని.. ఆ సమయానికి దర్శనానికి వచ్చి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

చాలా మంది భక్తులు సోషల్ మీడియాలో ఉన్న టైమింగ్స్ ప్రకారం గుడి దగ్గరకు వచ్చి.. ఆలయం మూసి ఉండటంతో.. గుడి బయటే కొబ్బరి కాయ కొట్టి నిరాశగా వెనుదిరుగుతున్నారు. దీంతో బాలాజీ దర్శనం వేళలకు సంబంధించి ఆలయ అర్చకులు, లేదా అధికారులు సరైన సమాచారాన్ని భక్తులకు తెలిసేలాగా ప్రచారం చేయాలని కోరుతున్నారు. దీనిపై ఆలయ అర్చకులు, లేదా పూజారులు ఎలా స్పందిస్తారో చూడాలి అంటున్నారు.



## తెలంగాణ కేబినెట్ భేటీ.. 2 పథకాల నిధుల విడుదలపై క్లారిటీ

**తెలంగాణ:** తెలంగాణ కేబినెట్ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనుంది. ఉద్యోగుల సమస్యలు, రైతు భరోసా నిధుల విడుదల, బనకచర్ల ప్రాజెక్ట్, రాజీవ్ యువ వికాసం నిధులు, కాళేశ్వరంపై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక వంటి అంశాలపై చర్చించనున్నారు. ఉద్యోగులు పెండింగ్ డీఏల విడుదలపై ఆశలు పెట్టుకున్నారు, నిరుద్యోగులు రాజీవ్ యువ వికాసం పథకం నిధుల విడుదలను ఆశిస్తున్నారు, రైతులు రైతు భరోసా తేదీల ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

గురువారం తెలంగాణ కేబినెట్ సమావేశంలో అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా ఉద్యోగులు సమస్యలు, రైతు భరోసా స్కీమ్ నిధుల విడుదల తేదీపై క్లారిటీ, బనకచర్ల ప్రాజెక్ట్ అంశం, రాజీవ్ యువ వికాసం నిధుల విడుదల, కాళేశ్వరం ఎన్‌డీఎస్‌ఏ నివేదిక వంటి పలు అంశాలపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నేటి కేబినెట్ సమావేశంపై ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి సమస్యలకు కేబినెట్ భేటీలో పరిష్కారం దొరుకుతుందని.. అలానే పెండింగ్ డీఏ విడుదల అంశంలో కూడా క్లారిటీ వచ్చే అవకాశం ఉంది అంటున్నారు. ఇప్పటికే బుధవారం నాడు రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ఉద్యోగ సంఘాలు భేటీ అయ్యాయి. ఈ సమావేశంలో వారు అనేక అంశాలపై చర్చించారు. దీంతో నేటి కేబినెట్ భేటీ తర్వాత ఉద్యోగులకు సంబంధించి ఒకటి లేదా రెండు పెండింగ్ డీఏలపై ప్రకటన ఉంటుందని భావిస్తున్నారు.

అలానే రాజీవ్ యువ వికాసం స్కీమ్‌కు సంబంధించి కూడా కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది అంటున్నారు. ఇప్పటికే రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి శాంక్షన్ లెటర్ల పంపిణీ వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కేబినెట్‌లో చర్చించి.. రూ. లక్ష వరకు నిధుల విడుదలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది అంటున్నారు.

అలానే నేటి కేబినెట్ భేటీలో రైతు భరోసా పథకం నిధుల విడుదల తేదీ, వర్షాకాలం పంటల సాగుపైనా నిర్ణయాలు ఉండే అవకాశం ఉంది. అలానే ప్రస్తుతం రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, లబ్ధిదారలు ఎంపిక, ఇళ్ల నిర్మాణం మొదలు వంటి పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే.. లబ్ధిదారులుగా ఎంపికైన వారికి అధికారులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేటి కేబినెట్ భేటీలో ఈ పథకం అమలుపై చర్చ జరగనుంది. వీటితో పాటుగా విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలు, భూభారతి చట్టం అమలు, భూదాన్ భూముల వ్యవహారంతో పాటు పలు పెండింగ్ ప్రాజెక్ట్‌ల గురించి కేబినెట్ భేటీలో చర్చించే అవకాశం ఉంది. నేటి కేబినెట్ భేటీపై ఉద్యోగులతో పాటు, నిరుద్యోగులు, అన్నదాతలు అనేక ఆశలు పెట్టుకున్నారు. మరి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి అంటున్నారు జనాలు.

## మాతృ ప్రేమకు సజీవ సాక్ష్యం..

**జగిత్యాల:** పట్టణంలో తల్లి ప్రేమకు అద్దం పట్టే హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ఓ రైతు ఇంట్లో తల్లి ఆవు దూరమవడంతో.. లేగదూడ ఆకలితో అల్లాడిపోయింది. బిడ్డ ఆవేదన చూసి చలించిన రైతు.. దూడను ఆటోలో ఎక్కించుకుని తల్లిని వెతుకుతూ పట్టణం మొత్తం తిరిగాడు. కొత్త బస్టాండ్ వద్ద తల్లి ఆవు కనిపించగా.. బిడ్డను చూసి పట్టలేని ఆనందంతో ఆవు ఆటో వెంట ప్రాణాలకు తెగించి పరుగెత్తింది. ఈ అపురూప దృశ్యం మూగజీవాల్లోని నిస్వార్థ మాతృ ప్రేమకు నిదర్శనంగా నిలిచింది.

తల్లి ప్రేమను వర్ణించానికి మాటలు చాలవు. బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకునేందుకు పడే తపన.. కాసేపు కళ్లముందే కనబడకపోతే తల్లడిల్లిపోయే ఆ మాతృ హృదయం.. తల్లి నిస్వార్థ ప్రేమకు నిదర్శనాలు. అయితే.. వెలకట్టలేని ఈ తల్లి ప్రేమ.. కేవలం మనుషులోనే కాదు మూగజీవాల్లోనూ ఎంత బలంగా ఉంటుందో నిరూపించే.. అపురూప దృశ్యం జగిత్యాల పట్టణంలో ఆవిష్కృతమైంది. మూగజీవాల్లోనూ అదే ఆరాటం, అదే తపన, అదే నిస్వార్థం ఉంటుందని ఈ ఘటన నిరూపించటమే కాదు.. ఈ సంఘటన చూసిన ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. తల్లి ప్రేమకు సజీవ సాక్ష్యంగా నిలించింది.

జగిత్యాల పట్టణా శివారు గోవింద్ పల్లెకు చెందిన నరేందర్ అనే ఓ రైతు ఇంట్లో.. ఆవు ఇటీవలే ఓ లేగదూడకు జన్మనిచ్చింది. కొన్ని రోజుల క్రితమే పుట్టిన ఆ లేగదూడ.. తల్లి పాలు తప్ప ఇంకేమీ ఎరుగదు. అలాంటి చిన్ని ప్రాణం.. కంటి ముందు తల్లి కనపడకపోవటంతో అల్లాడిపోయింది. అయితే.. సాయంత్ర సమయంలో తల్లి ఆవు ఇంటి నుంచి వెళ్లిపోయి.. తిరిగి రాకపోవడంతో లేగ దూడ పడిన ఆవేదన వర్ణనాతీతం. ఆ దృశ్యాన్ని చూసి చలించిపోయిన నరేందర్.. తల్లిని బిడ్డను కలిపేందుకు తన ప్రయత్నాన్ని ప్రారంభించాడు. ఆ చిన్నారి దూడను తన ఆటోలో ఎక్కించుకున్నాడు. దూడను వెంటబెటు ్టకుని తల్లిని వెతుకుతూ.. గంటల తరబడి జగిత్యాల పట్టణం మొత్తం కలియతిరిగాడు.

పట్టణం నలుమూలలా వెతికిన తర్వాత.. కొత్త బస్టాండ్ దగ్గర నరేందర్‌కు తల్లి ఆవు కనిపించింది. తన బిడ్డను ఆటోలో చూసిన ఆ తల్లి ఆవుకు పట్టలేని ఆనందం. ఒకవైపు ఆనందం.. మరోవైపు తన బిడ్డ ఆకలితో అల్లాడిపోయిందన్న తపన.. ఆ ఆవు గుండెల్లో అలజడి రేపింది. ఆటోలో ఉన్న తన బిడ్డకు పాలిచ్చేందుకు మాతృహృదయం తల్లడిల్లిపోయింది. ఇంకేం ఆలోచించలేదు.. తన బిడ్డ ఎక్కడ దూరం అయిపోతుందో అన్న భయంతో, ఆకలితో ఉన్న తన బిడ్డకు పాలు ఇవ్వాలన్న తపనతో.. ఆ ఆవు ఆ ఆటో వెంటే పరుగులంకించుకుంది. వాహనాల రద్దీని కూడా లెక్కచేయకు ండా.. ప్రాణాలకు తెగించి బిడ్డ కోసం పరుగెత్తిన ఆ తల్లి ఆవు దృశ్యం.. అక్కడున్నవారి గుండెలను పిండేసింది.

# మరో ప్రతిష్ఠాత్మక యూనివర్శిటీ ఏర్పాటు..

ఆంధ్రప్రదేశ్: రాజధాని అమరావతిలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' ఏర్పాటు కానుంది. దీనికి సంబంధించిన ఆర్డినెన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ యూనివర్సిటీ న్యాయ విద్యకు, పరిశోధనకు ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడానికి బీసీఐ ట్రస్ట్ ముందుకు వచ్చింది. అమరావతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ రాబోతోంది. న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. బీసీఐ (బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో 'ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ యూనివర్సిటీ న్యాయ విద్యకు, పరిశోధనకు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడానికి బీసీఐ ట్రస్ట్ ముందుకు వచ్చింది. ఈ మేరకు ఇటీవల బీసీఐ అధ్యక్షుడు, ముఖ్య సభ్యులు గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో వేర్వేరుగా సమావేశమైన సంగతి తెలిసిందే. అమరావతిలో బీసీఐ ఏర్పాటు చేయబోయే న్యాయ విశ్వవిద్యాలయంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఆర్బిట్రేషన్ సెంటర్ కూడా ఉంటుంది. ఈ యూనివర్సిటీ న్యాయ, అనుబంధ రంగాల్లో ఉన్నత విద్యకు, నైపుణ్యాభివృద్ధికి ఎంతో ఉపయోగంగా ఉంటుందంటున్నారు. 1986లో బెంగళూరులో బీసీఐ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్ఎల్ఎస్ఐయూ (నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ), అలాగే ఐఐయూఎల్ఈఆర్ (ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) 2022లో గోవాలో ఏర్పాటయ్యాయి. ఈ సంస్థలకు ఎంతో గొప్ప పేరు ఉంది. ఈ యూనివర్సిటీ రాకతో న్యాయ విద్య మరింత అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు.

మరోవైపు అమరావతి నిర్మాణం పనులు ఊపందుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తికాగా.. ఇప్పుడు పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం రూ.64,000 కోట్లతో ప్రణాళికలు రూపొందించగా.. ఇప్పటికే రూ.50 వేల కోట్లకు పైగా పనులకు టెండర్లు పూర్తయ్యాయి. ఈ అమరావతి పనులన్నీ మూడేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భవిష్యత్తులో ఎయిర్‌పోర్ట్, స్పోర్ట్స్ సిటీ వంటి వాటి కోసం మరో 45 వేల ఎకరాల భూమిని సేకరించనున్నారు. ప్రస్తుతం రాజధానిలో ప్రభుత్వ భవనాలు కడుతున్నారు. రోడ్లు, కాలువలు అభివృద్ధి చేస్తున్నారు. నీటి కోసం రిజర్వాయర్లు నిర్మిస్తున్నారు. రైతులకు స్థలాలు ఇచ్చిన లేఅవుట్లను కూడా అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం 8 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు.

# పాప హత్యాచారం కేసు నిందితుడి ఆత్మహత్య..



కడప: పాపం అభం శుభం తెలియని మూడేళ్ల చిన్నారిని చిదిమేశాడు.. ఆ తల్లిదండ్రులకు కంటిపాపను దూరం చేశాడు.. ఆ కుటుంబాన్ని తీరని విషాదంలోకి నెట్టేశాడు. ఆ పాపం వెంటాడిందో.. తల్లిదండ్రులే ఛీ పో అని అసహ్యించుకుంటారనుకున్నాడో.. ఈ సమాజంలో ఇక బతకలేనని అనుకున్నాడో ఏమో ప్రాణాలు తీసుకున్నాడు. తప్పుచేసిన వాడు ఎప్పటికైనా శిక్ష అనుభవించక తప్పదనే గుణపాఠాన్ని నేర్పించాడు. ఇదీ కడప జిల్లాలో సంచలనం రేపిన మూడేళ్ల బాలిక హత్యచార ఘటనలో నిందితుడుడు రహమతుల్లా పరిస్థితి. ఈ కేసులో ఊహించని విధంగా నిందితుడు నీళ్లలో శవమై తేలాడు.

కడప జిల్లా మైలవరం మండలం ఎ.కంబాలదిన్నెలో దూదేకుల రహమతుల్లా గత నెల 23న మూడేళ్ల చిన్నారిని అత్యాచారం, హత్య చేసిన ఘటనలో నిందితుడిగా ఉన్నాడు. ఆయన మృతదేహాన్ని మైలవరం జలాశయంలో స్థానికులు గుర్తించారు.. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించగా.. జలాశయం ఒడ్డున ఉన్న దుస్తులు కనిపించాయి. దగ్గరకు వెళ్లి చూడగా హత్యాచార ఘటనలో నిందితుడు రహమతుల్లాగా తేల్చారు. అతడి మృతదేహాన్ని వెంటనే జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి పోస్ట్‌మార్టమ్ నిర్వహించారు.

అనంతరం మృతదేహాన్ని జమ్మలమడుగు మండలం మోరగుడిలోని సొంత ఊరికి తీసుకెళ్లారు. పోలీసులు అతడి తల్లికి మృతదేహాన్ని అప్పగించేందుకు వెళ్లగా.. ఆమెతో పాటు కుటుంబ సభ్యులు తీసుకోవడానికి నిరాకరించారు. దీంతో ఏమీ చేయలేని పరిస్థితిలో జమ్మలమడుగు మున్సిపాలిటీ సిబ్బంది ట్రాక్టర్‌లో మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నెల 23న ఈ హత్యాచార ఘటన జరగ్గా.. ఆ రోజే నిందితుడు రహమతుల్లా పారిపోయాడని పోలీసులు తెలిపారు. అతడి కోసం గాలించినా ఆచూకీ తెలియలేదు. ఆ తర్వాత స్థానికులు అతడి ఇంటిని జేసీబీతో కూల్చేసిన సంగతి తెలిసిందే. ఆ ఊరి జనాలు కుటుంబ సభ్యుల్ని వేలివేశారు. ఇటు పోలీసులు రహమతుల్లా కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే అతడు ఒత్తిడితో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానిస్తున్నారు పోలీసులు.

కడప జిల్లా ప్రొద్దుటూరు అమృతనగర్‌కు చెందిన భార్యాభర్తలు మూడేళ్ల కూతురితో కలిసి బంధువుల పెళ్లి కోసం మైలవరం మండలం కంబాలదిన్నెకు వెళ్లారు. ఆ చిన్నారి పెళ్లి మండపం బయట ఆడుకుంటున్న సమయంలో రహమతుల్లా అరటి పండు ఇస్తానని చెప్పి ఆశ చూపించాడు. పాపను ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు.. తాను ఎక్కడ దొరికిపోతానని భావించి పాపం బాలికను హత్య చేశాడు. పాప కనిపించకపోవడంతో తల్లిదండ్రులు కళ్యాణమండపం దగ్గర గాలించారు. ఆ తర్వాత కొద్దిసేపటికి ముళ్ల పొదల్లో బాలిక మృతదేహాన్ని గుర్తించారు.. దీంతో తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# టీటీడీ సీవీఎస్వోగా కేవీ మురళీకృష్ణ బాధ్యతలు..



తిరుమల: తిరుపతి దేవస్థానం ముఖ్య నిఘా, భద్రతాధికారిగా కేవీ మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. శ్రీవారికి సేవ చేసుకునే అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. గతంలో తిరుమలలో పనిచేసిన అనుభవం తనకు ఎంతగానో ఉపయోగపడుతుందని, అక్రమాలకు తావు లేకుండా నిబద్ధతతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. తిరుమలలో భద్రతా ప్రమాణాలు మెరుగుపరచడానికి, దళారి వ్యవస్థను అరికట్టడానికి కృషి చేస్తానని తెలిపారు మురళీ.

తిరుమల తిరుపతి దేవస్థానం ముఖ్య నిఘా, భద్రతాధికారి (సీవీఎస్వో)గా కేవీ మురళీకృష్ణ తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న తర్వాత సీవీఎస్వో రంగనాయకులు మండపంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు సీవీఎస్వో కేవీ మురళీకృష్ణకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అడిషనల్ సీవీఎస్వో వెంకట శివకుమార్ రెడ్డి, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారికి సేవ చేసుకునే అవకాశం కల్పించిన ముఖ్య మంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు ధనవ్యాధాలు తెలిపారు మురళీకృష్ణ. తిరుమలలో గతంలో డీఎస్పీ, ఏఎస్పీగా విధులు నిర్వహించానని.. ఇది తనకు ఎంతగానో దోహద పడుతుందన్నారు. టీటీడీ ముఖ్య అధికారులు తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా తన బాధ్యత నిర్వహిస్తానన్నారు. టీటీడీలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా నిబద్ధతతో పని చేస్తానన్నారు. టెక్నాలజీ పరంగా మరింత మెరుగ్గా ముందుకు వెళ్లేందుకు పక్కా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. తిరుమలలో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగవుతాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దళారి వ్యవస్థను అరికట్టే విధంగా పటిష్ఠమైన వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మురళీకృష్ణ 2011లో గ్రూప్స్ రాసి డీఎస్పీ అయ్యారు.. గతంలో ఆయన డీఎస్పీగా తిరుపతి, తిరుమలలో పనిచేశారు. అడిషనల్ ఎస్పీగా ప్రమోషన్ దక్కిన తర్వాత తిరుమలలో విధులు నిర్వహించారు.. అక్కడే ఎస్పీగా ప్రమోషన్ దక్కింది. అనంతరం తిరుపతి రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన మొన్నటి వరకు విశాఖపట్నంలో ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేశారు. ఆయనకు తిరుపతి, తిరుమలలో పనిచేసిన అనుభవం ఉండటంతో ఆయనకు టీటీడీ సీవీఎస్వోగా బాధ్యతలు అప్పగించారు.

తిరుపతిలో జనవరి 8న వైకుంఠ ఏకాదశి దర్శన టికెట్ల కౌంటర్ల దగ్గర జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు చనిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు బాధ్యులైన టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడిని ప్రభుత్వం వెంటనే బదిలీ చేసింది.. ఇతర టీటీడీ అధికారులపైనా చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలుకు టీటీడీ సీవీఎస్వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. చిత్తూరు ఎస్పీగా ఉంటూ టీటీడీ బాధ్యతలు నిర్వహించడం ఇబ్బందిగా మారడంతో.. ఈ ఏడాది మార్చి 12న తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజును ఎఫ్ఏసీ సీవీఎస్వోగా ప్రభుత్వం నియమించింది.. నిన్నటి వరకు ఆయనే ఈ బాధ్యతలు చూశారు. ఇప్పుడు తాజాగా మురళీకృష్ణకు ఆ బాధ్యతలు అప్పగించారు. టీటీడీకి పూర్తిస్థాయిలో సీవీఎస్వో రావడంతో తిరుమలలో భద్రతతో పాటూ ఇతర అంశాలపై ఫుల్‌గా ఫోకస్ పెట్టనుంది.

**మురళీకృష్ణ 2011లో గ్రూప్స్ రాసి డీఎస్పీ అయ్యారు.. గతంలో ఆయన డీఎస్పీగా తిరుపతి, తిరుమలలో పనిచేశారు. అడిషనల్ ఎస్పీగా ప్రమోషన్ దక్కిన తర్వాత తిరుమలలో విధులు నిర్వహించారు.. అక్కేడే ఎస్పీగా ప్రమోషన్ దక్కింది. అనంతరం తిరుపతి రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన మొన్నటి వరకు విశాఖ పట్నంలో ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేశారు. ఆయనకు తిరుపతి, తిరుమలలో పనిచేసిన అనుభవం ఉండటంతో ఆయనకు టీటీడీ సీవీఎస్వోగా బాధ్యతలు అప్పగించారు.**

# వివాదంలో యూట్యూబర్ సీమరాజా..



ఆంధ్రప్రదేశ్: యూట్యూబ్ వీడియోలతో ఫేమస్ అయిన సీమరాజా చిక్కుల్లో పడ్డారు. తనపై ఆయన దాడి చేశారని కొందరు యువకులు ఆరోపిస్తున్నారు. కడప జిల్లాలో రోడ్డుపై వెళుతుండగా హారన్ కొడితే తప్పుకోలేదని దాడి చేశారని.. ఆ తర్వాత కూడా స్టేషన్లో కూడా కొట్టారని వాపోయారు. గంజాయి కేసు పెట్టాలని చూశారని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా, సీమరాజాపై అంబటి రాంబాబు గతంలోనే ఫిర్యాదు చేశారు. ఇప్పుడు అంబటి రాంబాబుపైనే కేసు నమోదు కావడం గమనార్హం.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై యూట్యూబ్ వీడియోలతో ఫేమస్ అయిన సీమరాజా వివాదంలో చిక్కుకున్నారు. సీమరాజా తమపై దాడి చేశారంటూ కొందరు యువకులు ఆరోపిస్తున్నారు. కడప జిల్లా చిట్వేలి మండలం గొల్లపల్లిలో బుధవారం రాత్రి తాము రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా.. సీమరాజా కారులో అటువైపుగా వచ్చారని.. హారన్ కొడితే తప్పుకోలేదనే కోపంతో తమపై దాడి చేశారని ఆరోపిస్తున్నారు. తమను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అక్కడ కూడా దాడి చేసినట్లు వారు చెబుతున్నారు. తమ తప్పు లేకపోయినా సరే సీమరాజా అనవసరంగా దాడికి తెగబడ్డారంటున్నారు. రివర్స్‌లో తమపై గంజాయి కేసు పెట్టాలని పోలీసులతో చెప్పినట్లు ఆ యువకులు అంటున్నారు. అయితే ఈ వివాదంపై పోలీసులు, సీమరాజా స్పందించాల్సి ఉంది.. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. 2024 ఎన్నికలకు ముందు సీమరాజా ఓ యూట్యూబ్ ఛానల్ ద్వారా ఫేమస్ అయ్యారు. వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తినని చెప్పుకుంటూ సెటైరికల్ వీడియోలు చేస్తున్నారు. సీమరాజాపై మాజీ మంత్రి అంబటి రాంబాబు గత నెలలో గుంటూరు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒకవేళ పోలీసులు చర్యలు తీసుకోకపోతే సుప్రీంకోర్టుకు వెళ్తానని.. వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తున్న సీమరాజాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనతో పాటుగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ మంత్రి రోజాలపై అనుచిత పోస్టులు పెడుతున్నారన్నారు. ఈ పోస్టులు వ్యక్తిగత దూషణలతో ఉన్నాయని.. తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారన్నారు. సీమరాజా వైఎస్సార్‌సీపీ కండువా వేసుకుని ప్రేలాపనలు చేస్తున్నారని.. ఆయన చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు.. కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని.. తాము చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఒకవేళ పోలీసులు తమ ఫిర్యాదుపై పోలీసులు స్పందించకపోతే న్యాయం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. ఎవరూ చట్టానికి అతీతులు కాదని గుర్తు పెట్టుకోవాలన్నారు. గతంలో టీడీపీ నేతలు వైఎస్ జగన్‌పై అనుచిత ట్వీట్లు చేసినప్పుడు పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. సీమరాజా తన వ్యక్తిగత జీవితంపై, వైఎస్సార్‌సీపీ శ్రేణులపై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నారన్నారు. గతంలో కూడా మొదట పోలీసులు కేసు నమోదు చేయలేదని.. కోర్టు ద్వారా పోరాడి నాలుగు కేసులను నమోదు చేయించానన్నారు. ఇప్పుడు తాజాగా సీమరాజా మరో వివాదంలో చిక్కుకున్నారు.

మరోవైపు మాజీ మంత్రి అంబటి రాంబాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు. విధుల్లో ఉన్న పోలీసుల్ని బెదిరించిన ఘటనలో కేసు ఫైల్ చేశారు. బుధవారం గుంటూరులో వైఎస్సార్‌సీపీ 'వెన్నుపోటు దినం' పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ క్రమంలో పోలీసులకు, అంబటి రాంబాబు మధ్య వాగ్వాదం జరిగింది. అయితే తమ విధులకు ఆటంకం కలిగించారని గుంటూరు పట్టాభిపురం పోలీసు స్టేషన్‌లో అంబటి రాంబాబు సహా మరికొందరు వైఎస్సార్‌సీపీ నేతలపై సెక్షన్ 353 కింద కేసు నమోదు చేశారు పోలీసులు.

# కుప్పం సమీపంలో హర్యానా దొంగల గ్యాంగ్

చిత్తూరు: జిల్లా కుప్పం మీదుగా దొంగల ముఠా సరిహద్దు దాటుతోందనే సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. కృష్ణగిరి-పలమనేరు జాతీయ రహదారి తంబిగానిపల్లె చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. రాత్రి 10 గంటల 30 నిమిషాలకు పలమనేరు నుంచి తమిళనాడులోని కృష్ణగిరి వైపు వెళ్తున్న కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన స్కార్పియో కారును తనిఖీ కోసం పోలీసులు ఆపారు. ఇద్దరు కానిస్టేబుళ్లు కారును తనిఖీ చేసేందుకు ముందుకు వెళ్లగా అప్రమత్తమైన దొంగలు కారును వెనక్కి పోనిచ్చి కానిస్టేబుళ్లపైకి ఎక్కించేందుకు ముందుకు వేగంగా దూసుకొచ్చారు. వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యి పక్కకు తప్పుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. వారు దొంగల ముఠాగా నిర్ధారించుకున్న గ్రామీణ సీఐ మల్లేష్ యాదవ్ ఫైరింగ్ ఓపెన్ చేశారు. తన సర్వీసు రివాల్వర్‌తో కారు డ్రైవర్ తొడకు తగిలేలా ఓ రౌండ్ కాల్పులు జరిపారు. కానీ, వారిని నిలువరించలేకపోయారు. ఇక దొంగలు వేగంగా కారుతో సహా అక్కడి నుంచి పారిపోయారు. దీంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. పలు బృందాలుగా విడిపోయి సమీప ప్రాంతాల్లో దొంగల కోసం గాలిస్తున్నారు.

# రూ.850 కోట్లతో, ఎయిర్‌పోర్ట్ రేంజ్‌లో కొత్త లుక్..

విజయవాడ: రైల్వే స్టేషన్‌కు మంచి రోజులు రానున్నాయి. రాబోయే 30 ఏళ్లలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని స్టేషన్‌ను అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు. ఈ మేరకు నీతి ఆయోగ్ ఆమోదం తెలిపింది. రూ.850 కోట్లతో పీపీపీ విధానంలో స్టేషన్‌ను ఆధునీకరించనున్నారు. విజయవాడ రైల్వే స్టేషన్‌ను కేటగిరి-1 కింద అభివృద్ధి చేస్తారు. ప్రస్తుతం రోజుకు 1.14 లక్షల మంది ప్రయాణికులు వస్తున్నారు.. అదే రద్దీ సమయాల్లో గంటకు 9,120 మంది రాకపోకలు ఉంటుంది. 2031 నాటికి ఈ సంఖ్య రోజుకు 2 లక్షలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. అందుకే రద్దీ సమయాల్లో ఒకేసారి 20 వేల మంది ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించనున్నారు.. చూడటానికి ఎయిర్‌పోర్ట్ రేంజ్‌లో లుక్‌లో కనిపించనుంది. ప్రస్తుతం ఎన్ఎస్‌జీ 01 జాబితాలో ఉన్న విజయవాడ రైల్వేస్టేషన్ 12,538 చదరపు మీటర్లలో ఉంది. దీనిని 1.54 లక్షల చదరపు మీటర్లకు పెంచనున్నారు. స్టేషన్ 84 వేల చదరపు మీటర్లలో ఉంటుంది. హోటళ్లు, ఇతర వాణిజ్య సముదాయా లు 70 వేల చదరపు మీటర్లలో ఏర్పాటు చేస్తారు. పార్కింగ్ స్థలం ప్రస్తుతం 426 కార్లకు మాత్రమే ఉంది.. ఇప్పుడు దానిని 1,700 కార్లకు పెంచను న్నారు. లిఫ్టుల సంఖ్య 8 నుంచి 35కి, ఎస్కలేటర్ల సంఖ్య 9 నుంచి 30కి పెరుగుతుంది. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను కూడా విస్తరిస్తారు. ప్లాట్‌ఫాంల సంఖ్య 10 నుంచి 12కి పెరుగుతుంది.



ప్రస్తుతం ప్రధాన మార్గం వైపు మాత్రమే అభివృద్ధి అంతా సాగుతుండగా.. కొత్త స్టేషన్‌లో పశ్చిమం వైపు కూడా కార్యకలాపాలు విస్తరిస్తామన్నారు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్. మరోవైపు రైల్వే అధికారులు విజయవాడ రైల్వేస్టేషన్‌పై ఒత్తిడి తగ్గించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. విజయవాడ శివారు ప్రాంతాలకు రైల్వే సేవలు చేరవేసేందుకు ఈ మేరకు గుణదల రైల్వే స్టేషన్ సిద్ధమవుతోంది. పనులు వేగంగా జరుగుతుండగా.. జూన్ నెలాఖరు నాటికి గుణదల శాటిలైట్‌స్టేషన్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# నెల్లూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి..

నెల్లూరు: జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు కూలీలు దుర్మరణం చెందగా, పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఆత్మకూరు మండలం ఏఎస్ పేట క్రాస్ రోడ్డు వద్ద కారు, ఆటో ఢీకొన్న ఘటనలో ఈ విషాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మరోవైపు, ఓజిలీ మండలం రాచపాలెం వద్ద టెంపో బోల్తా పడిన ఘటనలో ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇవాళ తెల్లవారుజామున ఆత్మకూరు మండలంలోని ఏఎస్ పేట క్రాస్ రోడ్డు దగ్గర కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు కూలీలు అక్కడికక్కడే చనిపోగా.. మరో 10 మందికి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో గాయపడినవారిని దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆటోలో కూలీలు వెంకటరావుపల్లి నుంచి ముస్తాపురం ఆటోలో వెళ్తున్న



సమయంలో ఘటన జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగ్రాతులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

నెల్లూరు జిల్లా ఓజిలీ మండలం రాచపాలెం జాతీయ రహదారిపై రెండు రోజుల క్రితం మరో రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ ఎల్బీనగర్‌కు చెందిన 11 మంది టెంపో వాహనంలో విహారయాత్రకు వెళ్లారు. ఈక్రమంలో రాచపాలెం నేషనల్ హైవే మీదకు రాగానే టెంపో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు.. వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి.. వారిని 108 వాహనంలో గూడూరులోని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు జిల్లాకు చెందిన ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ అనంతపురం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. అల్లూరు మండలం నార్త్ మోపూరుకు చెందిన నల్లగార్ల రామ్మూర్తి అనంతపురం అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా విధుల్లో ఉన్నారు. రెండేళ్లుగా అనంతపురంలో జేఎన్‌టీయూ సమీపంలోని ఓ అపార్ట్‌మెంటులో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. రామ్మూర్తి కర్ణాటకలోని బళ్లారి జిల్లా చేళ్లగుర్కిలో ఎర్రితాత దర్శనం కోసం కారులో బయల్దేరగా.. విడపనకల్లు దగ్గర ఎదురుగా వచ్చిన ఖాళీ గ్యాస్ కంటైనర్ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు కాగా.. ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్సపొందుతూ చనిపోయారు. ఆయనకు భార్య రజియా, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.. ఆ కుటుంబం తీవ్ర విషాదంలో ఉంది.

# రిటైర్డ్ ఐపీఎస్ లా చదవబోతున్నారుగా..

ఆంధ్రప్రదేశ్: ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు లా చదవబోతున్నారు. ఆయన లాసెట్ ప్రవేశ పరీక్ష రాశారు. ప్రకాశం జిల్లా ఒంగోలు రైజ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆయన పరీక్ష రాసేందుకు వచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా న్యాయ కళాశాలల్లో ప్రవేశాల కోసం లాసెట్ నిర్వహించారు. శ్రీపద్మావతి మహిళా యూని వర్సిటీ ఆధ్వర్యంలో ఏపీ లాసెట్ జరిగింది. ఇవాళ ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్ష రాశారు. మొత్తం27258 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. రాష్ట్ర వ్యాప్తంగా 188 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జూన్ 16న తుది కీ, చివరి వారంలో ఫలితాలను విడుదల చేయనున్నారు.

2019 ముందు వరకు ఆంధ్రప్రదేశ్ ఇంటిలిజెన్స్ చీఫ్‌గా ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు గత ప్రభుత్వ హయాంలో సస్పెండ్ అయ్యారు. ఆయన్ను '2020 ఫిబ్రవరి 8 నుంచి 2022 ఫిబ్రవరి 7 వరకూ, 2022 జూన్ 28 నుంచి 2024 మే 30 వరకు' రెండుసార్లు దాదాపు నాలుగేళ్ల పాటూ సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. చివరిగా ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్ హోదాలో పదవీ విరమణ చేసిన సంగతి తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వర్వాత ఏబీ వెంకటేశ్వర రావుపై గత ప్రభుత్వ హయాంలోని నాలుగేళ్ల సస్పెన్షన్ కాలవ్యవధి



మొత్తాన్ని క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

అంతేకాదు ఏబీ వెంకటేశ్వరరావుకు ఇటీవల హైకోర్టులో కూడా ఊరట లభించింది. ఆయనపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పెట్టిన ఏసీబీ కేసును హైకోర్టు కొట్టివేసింది. భద్రత పరికరాల కొనుగోలు టెండర్లలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఈ కేసు పెట్టగా.. దీని ఆధారంగా విజయవాడ ఏసీబీ కోర్టులో ఛార్జిషీట్ కూడా దాఖలు చేశారు. అయితే, ఏసీబీ ఆరోపణలకు ఆధారాలు లేవని కోర్టు తేల్చింది. ఈ ఆరోపణలు న్యాయ విచారణలో నిలబడవని తెలిపింది. అలాగే ఏబీ వెంకటేశ్వరరావు దిగువ కోర్టులో విచారణ ఎదుర్కోవాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు జస్టిస్ ఎన్ హరినాథ్ ఈ తీర్పును వెలువరించారు. 2014-2019 మధ్య ఏబీ వెంకటేశ్వరరావు ఇంటిలిజెన్స్ చీఫ్‌గా పనిచేశారు. అయితే ఆ సమయంలో భద్రత పరికరాల కొనుగోలు టెండర్ వ్యవహారంలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో 2021 మార్చిలో ఏసీబీ ఆయనపై కేసు నమోదు చేసింది.

ఈ కేసును కొట్టేయాలని కోరుతూ 2022లో ఏబీ వెంకటేశ్వరరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఏపీ హైకోర్టు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో ఏబీ వెంకటేశ్వరరావుకు బిగ్ రిలీఫ్ దక్కిందనే చెప్పాలి. అంతేకాదు ఏబీ వెంకటేశ్వరరావు ఇటీవల కోడికత్తి కేసులో నిందితుడు శ్రీనును, డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని, విజయవాడలో జగన్‌పై రాళ్ల దాడి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని పరామర్శించారు. ఏబీ వెంకటేశ్వర రావులా చదివేందు కు సిద్ధం కావడం ఆసక్తి కరంగా మారింది. ఆయన పేదలు, వివిధ కేసుల్లో బాధితుల తరపున పోరాడేందు కులా చదువుతున్నారా అనే చర్చ జరుగుతోంది.

# బ్లడ్ క్యాన్సర్ లక్షణాలు...



క్యాన్సర్ అనే మాట వినగానే చాలా మంది భయపడతారు. ఎంతగా అవగాహన కల్పిస్తున్నప్పటికీ రోజురోజుకి ఈ సమస్య పెరుగుతోంది. బ్లడ్ క్యాన్సర్ అత్యంత సాధారణ రకం క్యాన్సర. బ్లడ్ క్యాన్సర్ అనేది రక్తకణాలు, ఎముక మజ్జలని ప్రభావితం చేసే క్యాన్సర్. ఇది తెల్ల రక్తకణాల అసాధారణ ఉత్పత్తి వల్ల వస్తుంది. పూర్తి వివరాలు తెలుసుకుందాం.

లుకేమియా అంటే.. అసాధారణ తెల్ల రక్త కణాలు నియంత్రణ లేకుండా విభజించబడి, చివరికి సాధారణ తెల్ల రక్త కణాలని భర్తీ చేస్తాయి. లుకేమియా సమస్య దాని ప్రధాన లక్షణాలు, చికిత్స గురించి హైదరాబాద్ యశోద హాస్పిటల్స్‌లోని సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ అంకాలజిస్ట్ %ఊ% హెమటో ఆంకాలజిస్ట్ డా. నిఖిల్ ఎస్ ఘద్యల్ పాటిల్ పూర్తి విషయాలు చెబుతున్నారు.

లుకేమియా రకాలు.. లుకేమియాలో చాలా రకాలు ఉన్నాయి. వీటిలో స్థిరమైన, దీర్ఘకాలిక రకాలైన లుకేమియా, లింఫోమా, మైలోమా, మైలోడిస్ప్లస్టిక్ సింద్రోమ్, మైలోప్రొలిఫెరేటివ్ నియోప్లాజమ్(క్రానిక్ మైలోయిడ్ లుకేమియా)లు ఉన్నాయి. అక్యూట్ అంటే స్పీడ్‌గా స్ప్రెడ్ అవుతున్న క్యాన్సర్. క్రానిక్ అంటే నెమ్మదిగా పెరిగే క్యాన్సర్. ఏ వయసు వారినైనా లుకేమియా ప్రభావితం చేసినప్పటికీ, తీవ్రమైన లింఫోసైటిక్ లుకేమియా వంటి కొన్ని రకాల లుకేమియా పిల్లలని ఎక్కువగా ఎఫెక్ట్ చేస్తుంది.



లక్షణాలు.. ఈ వ్యాధి లక్షణాలు అనేవి లుకేమియా రకాన్ని బట్టి ఉంటుంది. తీవ్రమైన రక్త క్యాన్సర్స్ సాధారణ లక్షణాలు అలసట, తిరిగి వచ్చే అంటువ్యాధులు, జ్వరం, రాషెస్, చిగుళ్ళ గాయాల నుండి రక్తస్రావం, రక్తహీనత, గడ్డలు, వాపు(లింఫోమాలో కనిపిస్తాయి), ఎముక నొప్పి (మైలోమాలో కనిపిస్తుంది) వీటితో బరువు తగ్గడం వంటివి కూడా ఉంటాయి. దీర్ఘకాలిక లుకేమియా మొదట్లో ఎలాంటి లక్షణాలను చూపించకపోవచ్చు. అయితే, వ్యాధి ముదిరే కొద్దీ లక్షణాలు కునిపిస్తాయి.





కారణాలు.. లుకేమియా అనేది కుటుంబ చరిత్ర, ధూమపానం, క్యాన్సర్ నిరోధక మందులు వాడడం, క్యాన్సర్ ట్రీట్‌మెంట్ రేడియేషన్ వంటి కారకాలు ఓ వ్యక్తికి రక్త క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతాయి. అలాగే, ఎప్స్టీన్ బార్ వైరస్ వంటి కొన్ని వైరస్‌లు లింఫోమా వంటి లుకేమియా ప్రమాదాన్ని పెంచుతాయి.

వ్యాధిని ఎలా నిర్ధారిస్తారు.. ముందుగా డాక్టర్ శారీరక పరీక్ష, పూర్తి రక్త గణన, ఎముక మజ్జ పరీక్ష వంటి పరీక్షలు చేస్తారు. వీటితో ఫ్లో సైటోమెట్రీ, బయాప్సీ, సీటి స్కాన్, వంటి కొన్ని ప్రత్యేక పరీక్షల ద్వారా లుకేమియాని నిర్ధారిస్తారు.

ట్రీట్‌మెంట్..

లుకేమియా ట్రీట్‌మెంట్ వ్యాధి రకం రోగి ఆరోగ్య పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. అక్యూట్ మైలోయిడ్ లుకేమియా, అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియా వంటి కొన్ని లుకేమియాలకు సాధారణంగా కీమోథెరపీతో ట్రీట్‌మెంట్ ఉంటుంది. దీర్ఘకాలిక లింఫోసైటిక్ లుకేమియా, లింఫోమా వంటి లుకేమియాలు, లక్షణం లేనివి అయితే స్టేజెస్ ప్రకారం మందులతో ట్రీట్‌మెంట్ చేస్తారు. మైలోయిడ్ లుకేమియా సాధారణంగా ఇమాటినిబ్ వంటి మెడిసిన్‌తో ట్రీట్‌మెంట్ ఉంటుంది. ఈ ట్రీట్‌మెంట్‌లో విప్లవాత్మక మార్పులొచ్చాయి. పేషెంట్స్ నోటి ద్వారా తీసుకునే మెడిసిన్స్‌తో దశాబ్దాల పాటు తీసుకోగలరు. కొన్ని అత్యాధునిక లుకేమియాలకు ఎముక మజ్జ మార్పిడి, కార్ట్‌జెల్ థెరపీ వంటి కొత్త ట్రీట్‌మెంట్స్ ఉంటాయి.

# ఇంట్లోనే తయారు చేయండి..







చాలా మందికి ముఖంపై మొటిమలు, చ్ఛలు, పిగ్మంటేషన్, అన్‌ఈవెన్ స్కిన్ వంటి సమస్యలు ఉంటాయి. ఇవన్నీ దూరమవ్వాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అందులో ఒకటి విటమిన్ సి సీరమ్ రాయడం. అయితే, దీనిని చాలా మంది కొంటుంటారు. ఇవి చాలా ఎక్స్‌పెన్సీవ్. అలా కాకుండా ఈ సీరమ్‌ని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. అదెలానో చూద్దాం.

కావాల్సిన పదార్థాలు.. విటమిన్ సి క్యాప్సూల్ -4, తేనె -ఓ చెంచా, గ్లిజరిన్ - ఓ చెంచా, అలోవెరా జెల్ - ఓ చెంచా.

తయారీ విధానం.. విటమిన్ సి ట్యాబ్లెట్స్ మెడికల్ షాపుల్లో దొరుకుతాయి. వాటిని తీసుకుని మెత్తగా చేయాలి. ఓ గిన్నె తీసుకుని అందులో విటమిన్ సి ట్యాబ్లెట్స్ పొడి, తేనె, గ్లిజరిన్, అలోవేరా జెల్ వేసి బాగా కలపాలి. అంతే సీరమ్ రెడీ.

బెనిఫిట్స్.. విటమిన్ సీ సీరమ్ అనేది స్కిన్ రొటీన్‌లో చాలా మంచిది. దీనిని రాయడం వల్ల నెమ్మదిగా చర్మంలోకి చర్మంలోకి చొచ్చుకుపోయి మొటిమలు, మచ్చలు, పిగ్మంటేషన్‌ని దూరం చేస్తుంది. దీనిని మాస్క్, ఫేస్ ప్యాక్‌ల్లో వాడొచ్చు. దీని వల్ల మీ స్కిన్ కాంతివంతంగా మెరుస్తుంది. ముందుగా ముఖాన్ని క్లీన్ చేశాక ఏదైనా టోనర్‌ని కొద్దిగా రాయండి. ఆ తర్వాత విటమిన్ సి సీరమ్ అప్లై రెండు నిమిషాల పాటు బాగా మసాజ్ చేయాలి. పగటి పూట సీరమ్‌ని అప్లై చేసి మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ లోషన్ రాయండి. ఎందుకంటే బయటికి వెళ్ళినప్పుడు ఎండవల్ల రేడియేషన్ రాకుండా. మీరు రాత్రి పూట సీరమ్ అప్లై చేయాలనుకుంటే ముందుగా ముఖాన్ని క్లీన్ చేసి సీరమ్ రాయండి. తర్వాత మాయిశ్చరైజర్ రాయండి. ఈ సీరమ్‌లో గ్లిజరిన్, తేనె ఉంటుంది. కాబట్టి కాస్తా జిగటగా అనిపిస్తుంది. కానీ, కచ్చితంగా మంచి రిజల్ట్స్ ఉంటాయి.

సైడ్ ఎఫెక్ట్స్.. ఈ సీరమ్ వాడడం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఏమైనా ఉంటాయా అని అనుకుంటారు. చాలా వరకూ దీని వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. అయితే, ముందుగా ప్యాచ్ టెస్ట్ చేయండి. దీనిని మీరు ఫ్రిజ్‌లో స్టోర్ చేసుకోండి. తయారు చేసిన సీరమ్‌ని 15 రోజులు వాడుకోవచ్చు.

# మనం తినే ఈ ఫుడ్స్ పెంపుడు జంతువులకి



చాలా మంది ఇంట్లో పెంపుడు జంతువులని పెంచుతారు. ఆ జంతువులకి ఫుడ్స్ పెట్టే విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. వాటికి ఎలాంట్నిహార పదార్థాలు తీసుకోవాలో, వీటికి ఎలాంటి ఫుడ్స్ పెట్టొచ్చో ఇప్పుడు చూద్దాం. చాలా మంది ఇళ్ళల్లో పెంపుడు జంతువులని పెంచుతుంటారు. కొంతమంది వాటి కోసం ప్రత్యేక భోజనం పెడితే, మరికొంతమంది ఇంట్లో వారి కోసం వండుకున్నవే వాటికి కూడా పెడతారు. కానీ, మనుషులు, జంతువుల జీర్ణ వ్యవస్థ ఒకేలా ఉండదు. మీరు తినేవి వాటికి జీర్ణం కాకపోవచ్చు. దీని వల్ల అవి చెప్పలేవు. కడుపునొప్పి వంటి సమస్యలు వస్తాయి. పెంపుడు జంతువులు సరిగ్గా పెరగాలంటే పోషకాలతో కూడిన ఫుడ్ కావాలి. అలాంటి ఫుడ్స్ ఏంటో ముందుగా తెలుసుకోవాలి.

ఆపిల్స్‌లో విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. అందులో ఫైబర్ కూడా ఉంటుంది. దీని వల్ల మీ పెట్స్‌కి జీర్ణ సమస్యలు ఉండవు. వీటిని అలానే ముక్కలుగా కట్ చేసి వేయొచ్చు. అలా తినకపోతే ఏవైనా అవి తినే ఫుడ్‌లో కలిపి పెట్టొచ్చు. క్యారెట్స్‌లో కూడా విటమిన్ ఎ ఎక్కువగా ఉంటుంది. ఇవి కుక్కల్లో ఇమ్యూనిటీని పెంచుతాయి. చర్మ ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. అందుకే క్యారెట్స్ ముక్కల్ని కాకుండా పెట్స్‌కి పెట్టొచ్చు. చేపలు కూడా మన ఇంట్లోని పెంపుడు జంతువులకి చాలా ఇష్టం. కుక్కలు అయితే, వీటిని తినడానికి ఎక్కువగా ఇష్టపడతాయి. వీటిని తినిపించడం వల్ల ప్రోటీన్ అందడమే కాకుండా ఇమ్యూనిటీ పెరుగుతుంది. ఇందులోని విటమిన్ బి కంటెంట్ కుక్కల రక్తప్రసరణ, జీర్ణ వ్యవస్థని హెల్దీగా చేస్తాయి. ప్రతి ఒక్కరి ఇళ్లల్లోనూ రైస్ వండుతుంటారు. ఈ రైస్‌ని మీ పెంపుడు జంతువులకి పెట్టొచ్చు. దీని వల్ల ఎలాంటి జీర్ణ సమస్యలు ఉండవు.





సన్నగా తరిగిన బీన్స్ కుక్కలకి పెట్టొచ్చు. దీని వల్ల ఐరన్, విటమిన్ కె అందుతుంది. వీటిని పచ్చిగా వండి లేదా, వండి ఎలా అయినా పెట్టొచ్చు. పుచ్చకాయలో వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది మీ పెంపుడు జంతువులు డీహైడ్రేట్ కాకుండా చేస్తుంది. ఇందులో విటమిన్ ఎ, సి, బి 6లు కూడా ఉన్నాయి. కానీ, వీలైనంత వరకూ వాటి విత్తనాలు వేయకుండా చూసుకోండి.

ఇలా కొన్ని ఫుడ్స్‌ని మనం పెంచుకునే కుక్కలకి పెట్టొచ్చు. వీటితో పాటు పెట్స్ ఎక్స్‌పర్ట్స్ సూచించే ఫుడ్స్ కూడా పెట్టాలి. అదే విధంగా, వాటిని రోజూ ఈవెనింగ్ బయటికి తీసుకెళ్ళడం నడిపించడం చేస్తుండాలి. ఇలాంటివి చేస్తుంటే మీ పెట్స్ ఎంతో హెల్దీగా ఉంటాయి.

# ఆసనాలు చేస్తే జలుబు, దగ్గు తగ్గుతుంది..

ధ్యానం, యోగా, వర్కౌట్, మంచి ఫుడ్ తీసుకోవడం వల్ల బాడీలో ఇమ్యూనిటీ పెరుగుతుంది. దీని వల్ల జలుబు, దగ్గు వంటి సమస్యలు దూరమవుతాయి. ఈ ఆసనాలు చేస్తే జలుబు, దగ్గు త్వరగా తగ్గుతుంది.. వాతావరణంలో వచ్చే మార్పుల కారణంగా కొన్ని సమస్యలు వస్తాయి. వీటి వల్ల జలుబు, దగ్గు వంటి సమస్యలొస్తాయి. బాడీలో ఇమ్యూనిటీ తగ్గడం వల్లే ఇలాంటి సమస్యలు వస్తాయి. జలుబు, దగ్గు చూడ్డానికి పెద్ద సమస్యలు కానప్పటికీ ఇవి ఇవి చాలా చిరాకు పట్టిస్తాయి. వీటిని పెద్దగా పట్టించుకోకపోతే దగ్గు సమస్య కఫంగా మారుతుంది. దీని వల్ల శ్వాస సమస్యలు కూడా పెరుగుతాయి. ముఖ్యంగా వర్షాకాలంలో. ఇలాంటివాటికి కేవలం మెడిసిన్ వాడడమే కాకుండా పూర్తిగా సమస్యని దూరం చేయాలంటే కొన్ని యోగాసనాలు హెల్ప్ చేస్తాయి. అవేంటో చూద్దాం. ఈ పర్వతాసనం చేయడం వల్ల కూడా జలుబు, దగ్గుని తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. ఇందుకోసం ముందుగా సుఖాసనంలో కూర్చోవాలి. ఆ తర్వాత రెండు చేతులని నెమ్మదిగా పైకి లేపాలి. అరచేతులని ఒకదానికొకటిని కలపండి.



ఇప్పుడు రెండింటినీ కలిపి కళ్ళు మూసి దీర్ఘంగా ఊపిరి పీల్చి శ్వాసని వదులుతూ చేతులని విడదీయండి. రోజుకి రెండు, మూడు సార్లు చేయడం వల్ల శ్వాస ప్రక్రియలు సక్రమంగా జరుగుతాయి. ఛాతీలో అంటుకున్న కఫం దూరమై జలుబు, దగ్గు సమస్యలు దూరమవుతాయి. ముందుగా నేలపై యోగా మ్యాట్ వేసి రెండు కాళ్ళని మడిచి నిటారుగా కూర్చోవాలి. ఇప్పుడు మీ కుడి, ఎడమ చేతులని తుంటి ఎముకలపై ఉంచాలి. ఇప్పుడు నడుముని వెనక్కి వంచి తల పైకెత్తి ఆకాశం వైపు చూడాలి. ఈ టైమ్‌లోనే దీర్ఘంగా ఊపిరి పీల్చుకుని రెండు నిమిషాల పాటు అలానే ఉండి వెనక్కి వంగి, తలని పక్కనుండి పక్కకు తిప్పండి. ఈ యోగాసనం కష్టంగా అనిపించినప్పటికీ చాలా మంచిది. కాబట్టి, ప్రతిరోజూ కనీసం రోజుకి రెండు సార్లు చేస్తే దగ్గు, జలుబు తగ్గుతుంది.

# విశ్రాంతి తీసుకున్నా.. నీరసం, అలసట తగ్గట్లేదా..?



దీన్నే మైయాల్జిక్ ఎన్సెఫలోమైలిటిస్ అని కూడా పిలుస్తారు. ఈ సమస్య ఉంటే.. విపరీతమైన అలసట ఉంటుంది. విశ్రాంతి తీసుకున్నా అలసట, నీరసం దూరం కావు. ఈ సమస్య కనీసం ఆరు నెలల పాటు కొనసాగుతుంది. క్రానిక్ ఫెటీగ్ సింద్రోమ్ రావడానికి గల కచ్చితమైన కారణాలను ఇంకా గుర్తించలేదు, అయితే ఇది వైరల్ ఇన్ఫెక్షన్లు, రోగనిరోధక వ్యవస్థ సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత, ఒత్తిడి వంటి కారణాల వచ్చే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. క్రానిక్ ఫెటీగ్ సింద్రోమ్ లక్షణాలు, నివారణ చిట్కాల గురించి ఈ స్టోరీలో చూద్దాం.




లక్షణాలు.. అలసట, బలహీనమైన జ్ఞాపకశక్తి , ఏకాగ్రత తగ్గడం, నిద్ర సరిగ్గా లేకపోవడం, కండరాలు, కీళ్ల నొప్పులు, తలనొప్పి, గొంతు నొప్పి, విస్తరించిన శోషరస కణుపులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు రోజురోజుకూ తీవ్రం అవుతాయి. నివారణ.. సమతుల్య జీవనశైలి, ఒత్తిడి తగ్గించుకోవడం, ప్రశాంతమైన నిద్ర, అధిక శ్రమను నివారించడం వంటి కొన్ని సాధారణ పద్ధతులు క్రానిక్ ఫెటీగ్ సింద్రోమ్‌ను నివారించడానికి సహాయపడతాయి.

పని తగ్గించుకోండి..అధిక శ్రమ కారణంగా.. లక్షణాలు తీవ్రమవుతాయి. సమతుల్య దినచర్యను ఏర్పరచుకోవడం, శారీరక శ్రమ తగ్గించుకోవడం, పనులను విభజించుకోవడం వంటివి చేస్తే.. లక్షణాలు తగ్గుతాయి. అవసరమైనప్పుడు మీ శరీరానికి విశ్రాంతినివ్వండి. లక్షణాలును తగ్గించుకోవడానికి.. ప్రశాంతమైన నిద్ర చాలా అవసరం. స్థిరమైన నిద్ర షెడ్యూల్‌ను మెయింటేన్ చేయండి. నిద్ర నాణ్యతను మెరుగుపరచడానికి ధ్యానం, లోతైన శ్వాస వ్యాయామాలు ప్రాక్టిస్ చేయండి. ఒత్తిడి తగ్గించుకోండి.. ఒత్తిడి క్రానిక్ ఫెటీగ్ సింద్రోమ్ లక్షణాలను తీవ్రతరం చేస్తాయి. మైండ్‌ఫుల్‌నెస్, యోగా, నచ్చిన పనులు చేయడం వంటివి మీ ఒత్తిడిని తగ్గిస్తాయి. సమతుల్య ఆహారం తీసుకోండి.. సమతుల్య ఆహారం మీ ఆరోగ్యాన్ని రక్షిస్తుంది. మీ డైట్‌లో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులతో సహా పోషకాలు సమృద్ధిగా ఉండే డైట్‌పై దృష్టి పెట్టండి. సరిపడా నీళ్లు తాగండి.. డీ హైడ్రేషన్ అలసట, ఇతర లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తుంది. సరైన హైడ్రేషన్ స్థాయిలను నిర్వహించడానికి రోజంతా నీరు పుష్కలంగా త్రాగాలి. కెఫిన్, ఆల్కహాల్‌ను పరిమితం చేయండి. ఎందుకంటే.. ఇవి నిద్రకు భంగం కలిగిస్తాయి, డీహైడ్రేషన్‌కు దారితీస్తాయి. సున్నితమైన వ్యాయామాలు చేయండి.. తీవ్రస్థాయి వ్యాయామాలు.. క్రానిక్ ఫెటీగ్ సింద్రోమ్ లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తాయి. ఉన్నావారికి.. సున్నితమైన, తక్కువ ప్రభావవంతమైన వ్యాయామాలు ప్రయోజనకరంగా ఉంటాయి. వాకింగ్, స్విమ్మింగ్, స్రెచ్చింగ్ వంటి వ్యాయామాలు.. మేలు చేస్తాయి.



# ప్లేట్‌లెట్ల కౌంట్ పెంచుతాయి..!







ప్లేట్‌లెట్లు తగ్గటం, రక్తం చిక్కపడటం, రక్తస్రావం వంటి చిక్కులకు దారితీస్తుంది. డెంగీ జ్వరం ఉంటే.. ఒళ్లంతా కాలిపోయేంత జ్వరం..కదిలితే ఎముకలు విరిగిపోయేట్టు నొప్పులు..వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. డెంగీ జ్వరం వచ్చిన కొంతమందిలో ప్లేట్‌లెట్లు పడిపోతుంటాయి. రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్య పెంచడానికి 5 ఆకులు సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఈ స్టోరీలో చూద్దాం. బొప్పాయి ఆకు.. డెంగీ పేషెంట్స్‌లో ప్లేట్‌లెట్ల కౌంట్ పెంచడానికి బొప్పాయి ఆకుల రసం ఎఫెక్టివ్‌గా సహాయపడతాయని ఓ అధ్యయనం స్పష్టం చేసింది. బొప్పాయి ఆకులతో కషాయం తయారు చేసుకుని.. రోజుకు రెండుసార్లు తాగవచ్చు. బొప్పాయి ఆకు రసం తాగితే.. ప్లేట్‌లెట్స్ వేగంగా పెరగడంతో పాటు.. జ్వరంగా కూడా తగ్గుతుంది.

వేప ఆకులు.. వేపాకుల్లో యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి హైపర్ గ్లైసెమిక్, యాంటి అల్సర్, యాంటి మలేరియల్, యాంటి ఫంగల్, యాంటి బ్యాక్టీరియల్, యాంటి వైరల్, యాంటి ఆక్సిడెంట్, యాంటి మ్యుటాజెనిక్, యాంటి కార్సినోజెనిక్ గుణాలు ఉంటాయి. ఆల్కలాయిడ్స్, రెసిన్స్, గమ్, ఫ్లోరైడ్, సల్ఫర్, టానిన్స్, ఆయిల్స్, సపొనిన్స్, ఫ్లేవనాయిడ్స్, స్టెరాల్స్, కాల్షియం లాంటివి పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. ఇది ప్లేట్‌లెట్స్ కౌంట్ కూడా పెంచుతుంది. డెంగీ పేషెంట్స్ వేప ఆకులను నీటిలో మరిగించి తీసుకుంటే.. మేలు జరుగుతుంది.

జామ ఆకులు.. జామ ఆకులు డెంగీని తగ్గించడానికి.. ఔషధంలా పనిచేస్తాయి. ఈ ఆకుల్లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్స్ గుణాలు మెండుగా ఉంటాయి. ఐదు జామఆకులను రెండు గ్లాసుల నీళ్లలో వేసి సగం అయ్యే వరకు మరిగించండి. అవి గోరువెచ్చగా అయిన తర్వాత.. ఒక స్పూన్ తేనె కలిపి తాగండి. ఇలా రోజుకు రెండు మూడు సార్లు తాగితే.. ప్లేట్‌లెట్ల కౌంట్ పెరుగుతుంది.

నేలవేము.. నేలవేములో డెంగీ నుంచి కోలుకోవడానికి సహాయపడే.. యాంటీవైరల్ గుణాలు ఉంటాయి. ఈ ఆకులు ఇతర వైరల్ ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. డెంగీ పేషెంట్స్ నేలవేము ఆకుల కషాయాన్ని తీసుకుంటే.. మేలు జరుగుతుంది.

బిరియానీ ఆకు.. డెంగీ పేషెంట్స్ బిరియానీ ఆకును నీటిలో మరిగించి తీసుకుంటే మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది ప్లేట్‌లెట్ల కౌంట్‌ను పెంచుతుంది. అయితే ఎట్టిపరిస్థితుల్లోనూ డాక్టర్ ఇచ్చే మందులను నిర్లక్ష్యం చేయకూడదని గుర్తుంచుకోండి.



# చిరుకి పోటీగా...

మాస్ మహారాజా రవితేజ తాజా చిత్రం 'RT76' పూజా కార్యక్రమాలతో జూన్ 5న సెట్స్ మీదకు వెళ్లింది. కిషోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని క్రియేషన్స్ నిర్మిస్తోంది. బిజినెస్ క్లాస్ ఫ్లైట్‌లో స్టైలిష్‌గా ఉన్న రవితేజ ఫస్ట్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ చిత్రానికి 'అనార్కలి' అనే టైటిల్ పెట్టే అవకాశముందని వార్తలు వస్తున్నాయి. కేతికా శర్మ, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటించనున్నట్లు సమాచారం. ఈ సినిమాను 2026 సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

మాస్ మహరాజ్ రవితేజ మరో సినిమాని లైన్లో పెట్టేశాడు. ఎస్-ఎల్‌వి క్రియేషన్స్ బ్యానర్‌పై కిషోర్ తిరుమల డైరెక్షన్‌లో రవితే హీరోగా ఓ సినిమా గురువారం ( జూన్ 5) నాడు సెట్స్ మీదికి వెళ్లింది,.పూజా కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభించిన వెంటనే నిర్మాణ సంస్థ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. అందులో రవితేజ బిజినెస్ క్లాస్ విమానంలో దర్జాగా ముందు సీటు మీదికి కాళ్లు చాపుకుని ఓ చేతిలో స్పానిస్ బుక్, మరో చేతిలో మద్యం బాటిల్ పట్టుకుని కూర్చుని ఉన్నాడు. ఫస్ట్ లుక్‌తో పాటు రిలీజ్ డేట్ కూడా అనౌన్స్ చేసి షాకిచ్చారు మేకర్స్. రవితేజ 76 చిత్రంగా సెట్స్ మీదికి వెళ్లిన ఈ మూవీకి 'అనార్కలి' అనే టైటిల్ ఫిక్స్ చేయనున్నట్లుగా వార్తలొస్తున్నా దీనిపై ఇంకా అఫిషియల్‌గా ప్రకటన చేయలేదు. ప్రస్తుతానికి 'RT76' అనే వర్కింగ్ టైటిల్‌తోనే షూటింగ్ ప్రారంభమైంది.

రవితేజ నటించిన తాజా చిత్రం 'మాస్ జాతర' విడుదలకు సిద్ధమవుతోంది. ఏప్రిల్‌లోనే రిలీజ్ కావాల్సిన ఈ మూవీ వినాయక చవితి సందర్భంగా ఆగస్టు 27న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇటీవల అఫిషీయల్‌గా ప్రకటించారు. ఇందులో శ్రీలీల హీరోయిన్. 'ధమాకా' తర్వాత వీరిద్దరి కాంబినేషన్లో వస్తోన్న చిత్రం కావడంతో మూవీపై మంచి అంచనాలు ఉన్నాయి. ఆ సినిమా షూటింగ్ పూర్తికావడంతో రవితేజ... ఇప్పుడు కిషోర్ తిరుమలతో మూవీకి రెడీ అయిపోయాడు. ఇందులో ఇద్దరు హీరోయిన్లకు ఛాన్స్ ఉండగా ముందుగా కయాదు లోహర్, మమితా బైజును తీసుకోవాలని అనుకున్నారట. అయితే తెరవెనుక ఏం జరిగిందో తెలియదు గానీ.. ఇప్పుడైతే కేతికా శర్మ, ఆషికా రంగనాథ్‌ని ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది.

ఈ చిత్రాన్ని సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లు నిర్మాతలు అప్పుడే ప్రకటించడం చర్చనీయాంశమైంది. ఎందుకంటే వచ్చే సంక్రాంతికి అప్పుడే కొన్ని సినిమాలు ఖర్చీఫ్ వేసుకుని రెడీగా ఉన్నాయి. చిరంజీవి-అనిల్ రావిపూడి సంక్రాంతికే విడుదల చేయనున్నారు. ఈ ఏడాది సంక్రాంతి సీజన్‌కి 'సంక్రాంతికి వస్తున్నాం'తో బ్లాక్‌బస్టర్ అందుకున్న అనిల్ రావిపూడి ఏటా సంక్రాంతి పండక్కి తన సినిమా రిలీజ్ చేస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. అందుకు తగినట్లుగానే చిరంజీవి, నయనతార జంటగా తెరకెక్కిస్తోన్న చిత్రాన్ని సంక్రాంతికి రెడీ చేసే పనిలో బిజీగా ఉన్నాడు. అలాగే నవీన్ పోలిశెట్టి, మీనాక్షి చౌదరి జంటగా తెరకెక్కిన 'అనగనగా ఓ రాజు', యష్ 'టాక్సిక్', విజయ్ 'జన నాయగన్' చిత్రాలు కూడా సంక్రాంతికే రానున్నాయి. ఇంత తీవ్రమైన పోటీ మధ్య సంక్రాంతి పోటీ ఎలా మారుతుందోనని టాలీవుడ్ ఇండస్ట్రీ ఆసక్తిగా గమనిస్తోంది.





# మెగా బ్రదర్స్‌కు వీఎఫ్ఎక్స్ కష్టాలు

మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ట మల్లిడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'విశ్వంభర'. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ ఏడాది సంక్రాంతికే రిలీజ్ అవ్వాల్సింది. కానీ వాయిదా పడింది. వాయిదా వేసి కూడా ఐదు నెలలు అయింది. అయినా సరే కొత్త విడుదల తేదీని ప్రకటించలేదు. మళ్ళీ ఎప్పుడు రిలీజ్ చేస్తారనేది క్లారిటీ రావడం లేదు. మరోవైపు పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'హరి హర వీరమల్లు'. ఐదేళ్లుగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా వాయిదాల పర్వం కొనసాగుతూ నే ఉంది. దర్శకులు మారుతున్నాయి.. ఏళ్లకు ఏళ్లు గడిచాయి కానీ.. సినిమా మాత్రం ఇంకా ప్రేక్షకుల ముందుకు రాలేదు. అయితే మెగా బ్రదర్స్ సినిమాలు లేట్ అవ్వడానికి కారణం వీఎఫ్ఎక్స్ అనే టాక్ వినిపిస్తోంది. 'విశ్వంభర' అనేది సోషియో ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్ మూవీ. సీజీ వర్క్ కి అధిక ప్రాధాన్యత ఉంది. టీజర్ రిలీజ్ చేసినప్పుడు విజువల్స్ పై దారుణమైన ట్రోలింగ్ జరిగింది. అమీర్ పేట్ ఎడిటింగ్స్ చాలా బెటర్ అని విమర్శలు ఎదుర్కొంది. దీంతో వీఎఫ్ఎక్స్ విషయంలో ఎక్కువ ఫోకస్ పెట్టినట్లుగా వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. కానీ పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఎక్కడిదాకా వచ్చాయనే సమాచారం మాత్రం బయటకు రాలేదు. ఎప్పుడు విడుదల చేస్తారనేది తెలియడం లేదు. మిగతా హీరోల సినిమాలన్నీ రెడీ అవుతున్న తరుణంలో, చిరంజీవి మూవీని ఏ సీజన్ లో తీసుకొస్తారనేది ఆసక్తికరంగా మారింది.

మరోవైపు వీరమల్లు అనేది ఫిక్షనల్ హిస్టారికల్ యాక్షన్ మూవీ. ఇందులోనూ వీఎఫ్ఎక్స్ కు ఎక్కువ స్కోప్ ఉంది. జూన్ 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. ఎలాగోలా పవన్ కళ్యాణ్ ను తీసుకొచ్చి షూటింగ్ కంప్లీట్ చేసారు కానీ.. సీజీ వర్క్ మాత్రం అనుకున్న టైంకి ఫినిష్ అవ్వలేదని తెలుస్తోంది. ఈ కారణం చేతనే ఇంకా ట్రైలర్ ని రిలీజ్ చేయలేదు. ట్రైలర్ చూడకుండా సినిమాపై కోట్లు ఖర్చు పెట్టడానికి బయ్యర్లు సిద్ధంగా లేరు. అందుకే ఇప్పటివరకూ పూర్తిగా బిజినెస్ జరగలేదు. ట్రైలర్ చూసిన తర్వాత హరి హర వీరమల్లు రేంజ్ ఏంటనేది తెలుస్తుందని నిర్మాత ఏఎం రత్నం చెబుతున్నారు.

అయితే వీరమల్లు విడుదలకు గట్టిగా ఐదు రోజుల సమయం కూడా లేదు. వీఎఫ్ఎక్స్ పనులు ఇంకా పెండింగ్ ఉన్నాయని, ఈసారి కూడా వాయిదా పడే అవకాశాలే ఎక్కువ అని గత రెండు మూడు రోజులుగా వార్తలు వస్తున్నాయి. పోస్ట్ పోన్ అవ్వడం ఖాయమని అందరికీ క్లారిటీ వచ్చింది. కానీ ఈ డేట్ మిస్సయితే మళ్ళీ ఎప్పుడు రిలీజ్ చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఇలా మెగా బ్రదర్స్ నటిస్తున్న సినిమాలు రెండూ కంప్యూటర్ గ్రాఫిక్స్ కారణంగానే లేట్ అవుతున్నాయి. వీలైనంత త్వరగా అన్ని పనులు పూర్తి చేసుకొని ఫైనల్ రిలీజ్ డేట్లు లాక్ చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

# వీరమల్లు దెబ్బకు కింగ్డమ్ వాయిదా?..

హరి హర వీరమల్లు పనులు ఇంకా పూర్తి కాలేదని అర్థం అవుతోంది. ట్రైలర్ ఇంకా రాలేదు.. ప్రీ రిలీజ్ ఈవెంట్ క్యాన్సిల్ చేశారు.. చూస్తుంటే జూన్ 12న వీరమల్లు రావడం లేదని తెలుస్తోంది. అయితే జూలై మీద వీరమల్లు కన్ను పడిందని సమాచారం. దీంతో మళ్లీ కింగ్డమ్‌కి దెబ్బేసేలా ఉన్నారని టాక్ వచ్చింది. దీంతో నిర్మాత రంగంలోకి దిగి క్లారిటీ ఇచ్చారు. ఇప్పటికి అయితే కింగ్డమ్ పోస్ట్ పోన్ చేసే ఆలోచన లేదని అన్నారు. పవన్ కళ్యాణ్ హరి హర వీరమల్లు వాయిదాల పర్వం ఇంకా కొనసాగుతూనే ఉంది. అసలేమాత్రం ఇంట్రెస్ట్ లేని ఈ ప్రాజెక్ట్‌ని ఇంకా ఇంకా పోస్ట్ పోన్ చేసుకుంటూనే వెళ్తోంది టీం. జూన్ 12న ఇక ఫిక్స్ అని అనుకున్నారంతా. కానీ మళ్లీ వాయిదా వేసుకునేలానే కనిపిస్తోంది వీరమల్లు టీం. ఈ సారి జూన్ చివరి వారం లేదా జులై మొదటి రెండు వారాల్లో రావాలని అనుకుంటోందట. అయితే జులై మొదటి వారంలో విజయ్ కింగ్డమ్ రానున్న సంగతి తెలిసిందే. వీరమల్లు వస్తే కింగ్డమ్‌ను వాయిదా వేస్తారనే టాక్ బయటకు వచ్చింది. దీంతో నిర్మాత క్లారిటీ ఇచ్చారు.

ఇప్పటికి అయితే తనకు తన కింగ్డమ్ మూవీని వాయిదా వేసే ఆలోచన లేదని నాగవంశీ తెలిపారు. ఒక వేళ వీరమల్లు జులై 4న వస్తే మాత్రం తన కింగ్డమ్‌ను వాయిదా వేసే విషయం గురించి ఆలోచిస్తానని అన్నారట. మరి వీరమల్లు టీం ఏం చేస్తుందో చూడాలి. వీరమల్లు గనుక జులై 4న వస్తామని డేట్ వేసుకుంటే.. అప్పుడు నాగవంశీ తన అభిమాన హీరో కోసం తన సినిమాని పోస్ట్ పోన్ చేసుకుంటాడన్నది మాత్రం పక్కా. ముందు నుంచీ కింగ్డమ్, హరి హర వీరమల్లుకి ఏదో లింక్ ఉన్నట్టుగానే కనిపిస్తుంది. ప్రతీ సారి ఈ రెండు మూవీస్ రిలీజ్ డేట్ క్లాష్ అవుతూనే వస్తోంది. ఇక ఇప్పుడు వీరమల్లు టీం అయితే జూలైలో వచ్చేందుకు మొగ్గు చూపుతున్నట్టుగా సమాచారం. ఒక వేళ మొదటి వారం అంటే జులై 4వ తేదీని ఎంచుకుంటే మాత్రం కింగ్డమ్ వెనక్కి వెళ్లడం ఖాయమన్నట్టే.

నిర్మాత నాగవంశీ అయితే ఇది వరకు కూడా తన స్టాండ్ ఏంటో చెప్పారు. వీరమల్లుతో నా సినిమాను ఎప్పటికీ పోటీగా దించలేను.. పవన్ కళ్యాణ్ సినిమా అంటే.. మా సినిమా అన్నట్టే.. మా మూవీ మీద మేం ఎందుకు పోటీగా దిగుతామని చెబుతూనే ఉన్నారు. ఇప్పుడు కూడా అదే మాట మీద ఉన్నట్టుగా తెలుస్తోంది. వీరమల్లు ఒక వేళ జులై 4వ తేదీన వస్తే మాత్రం కింగ్డమ్‌ను వాయిదా వేస్తామని చెప్పకనే చెబుతున్నారు.





# ఏ పేరుతో సేవ్ చేసుకున్నారంటే?

మంచు విష్ణు ప్రస్తుతం నెట్టింట్లో ఎక్కువగా ట్రెండ్ అవుతున్నారు. మంచు విష్ణు ఇస్తున్న ఇంటర్వ్యూలు, చెబుతున్న సమాధానాలతో నెట్టింట్లో ఎక్కువగా వైరల్ అవుతున్నారు. జూన్ 27న రానున్న కన్నప్ప కోసం విష్ణు చాలా శ్రమిస్తున్నారు. ప్రమోషన్స్, సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు అంటూ బిజీగా తిరుగుతున్నారు. ఇక త్వరలోనే కన్నప్ప నుంచి అదిరిపోయేలా, మరింత హైప్ పెంచేలా ట్రైలర్‌ను రిలీజ్ చేస్తారని సమాచారం. ఇక ఈ కన్నప్ప ప్రమోషన్స్‌లో భాగంగా విష్ణు ఎన్నో ఆసక్తికరమైన విషయాల్ని పంచుకున్నారు.

మంచు విష్ణు తన ఫోన్‌లో ఇతరుల నంబర్లను ఎక్కువగా నిక్ నేమ్‌తోనే సేవ్ చేసుకుంటారట. మోహన్ బాబు పేరుని మంచు ది లయన్ కింగ్ అని పెట్టుకున్నారట. ఇక ప్రభాస్ పేరుని అయితే రెబల్ అని సేవ్ చేసుకున్నాడట. ఎప్పటికీ ఇరిటేట్ చేసి, కోపంతో ఉండే కజిన్ పేరుని హల్క్ అని పెట్టుకున్నారట. ఇలా ఒక్కో పేరుని వారి నిక్ నేమ్‌తోనే సేవ్ చేసుకుంటానని విష్ణు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఇలా రివీల్ చేసిన విషయాలు నెట్టింట్లో ఎక్కువగా ట్రెండ్ అవుతున్నాయి. త్రిముఖ వ్యూహం అంటూ ముగ్గురు మీడియా పర్సన్స్‌కి ఒకే సారి ఇంటర్వ్యూ ఇచ్చారు మంచు విష్ణు. ఇక ఇందులో విష్ణు చాలా కాంట్రవర్సీ ప్రశ్నలకు సమాధానం ఇచ్చినట్టుగా కనిపిస్తోంది. ప్రోమో చూస్తుంటే ఈ ఇంటర్వ్యూ కచ్చితంగా నెట్టింట్లో వైరల్ అయ్యేలానే ఉంది. కన్నప్ప బడ్జెట్, గ్రాఫిక్స్ తీరు, వీఎఫ్ఎక్స్ క్వాలిటీ మీద ప్రశ్నలు సంధించారు. ఇక మంచు ఫ్యామిలీ గొడవల మీద కూడా ప్రశ్నలు వేసినట్టుగానే కనిపిస్తోంది.

హార్డ్ డిస్క్ గురించి కూడా మళ్లీ అడిగినట్టు కనిపిస్తోంది. ప్రస్తుతం పెరుగుతున్న టెక్నాలజీ, ఏఐ వాడకం మీద మంచు విష్ణు తన అభిప్రాయాన్ని కూడా పంచుకున్నారు. మంచు విష్ణు అయితే ఇప్పుడు కన్నప్పతో బాగానే ట్రెండ్ అవుతున్నారు. కన్నప్ప రిలీజ్ కోసం విష్ణు అయితే చాలానే ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. అసలే ఈ చిత్రంలో ప్రభాస్ పాత్ర అర్ధగంటకు పైగా ఉంటుందని చెప్పడంతో డార్లింగ్ ఫ్యాన్స్ కూడా మరింతగా అంచనాలు పెంచేసుకున్నారు.

బెంగళూరు తొక్కిసలాటను కుంభమేళాతో పోల్చిన సీఎం సిద్ధరామయ్య.. కన్నప్ప సినిమాకు ప్రభాస్ ఎంట్రీ, ప్రభాస్ మోహన్ బాబు కాంబో సీన్లు, మోహన్ లాల్ పాత్ర, అక్షయ్ కుమార్ కారెక్టర్ హైలెట్ అవుతాయని ఇన్ సైడ్ రిపోర్టులు వస్తున్నాయి. కన్నప్ప సినిమాలోని పాటలే పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేశాయన్న సంగతి తెలిసిందే. ఇక ముఖేష్ కుమార్ సింగ్ ఈ మూవీని పాన్ ఇండియా రేంజ్‌కు తగ్గట్టుగానే తీశాడని అంటున్నారు.

# హీరో విశాల్‌కు షాకిచ్చిన హైకోర్టు



తమిళ స్టార్ హీరో విశాల్‌కు మద్రాస్ హైకోర్టు షాకిచ్చింది. లైకా ప్రొడక్షన్స్ సంస్థకు 30 శాతం వడ్డీతో రూ.21 కోట్లు చెల్లించాలని తీర్పు చెప్పింది. 2016లో 'మరుదు' సినిమా కోసం తీసుకున్న రూ.15 కోట్ల అప్పు విషయాన్ని లైకా తీసుకొని విశాల్‌తో 30% వడ్డీతో ఒప్పందం చేసుకుంది. అయితే విశాల్, 'వీరమె వాగై చూడమ్' సినిమా హక్కులు ఇతర సంస్థకు అమ్మేయడంతో లైకా కోర్టును ఆశ్రయించింది. ఈ వివాదంపై కోర్టు విచారణ జరిపి, ఒప్పంద ఉల్లంఘనగా పేర్కొంటూ విశాల్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తాజాగా లైకాకు మొత్తం రూ.21 కోట్లు చెల్లించాలన్న తుది తీర్పు ఇచ్చింది.


తమిళ స్టార్ హీరో విశాల్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురదెబ్బ తగిలింది. నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్‌కు 30శాతం వడ్డీతో రూ.21 కోట్లు చెల్లించాలంటూ గురువారం తీర్పు ఇచ్చింది. 2016లో 'మరుదు' (తెలుగులో 'రాయుడు') చిత్రం నిర్మాణం కోసం గోపురం ఫిలిమ్స్‌కు చెందిన అంబుజెజియన్ అనే వ్యక్తి నుంచి విశాల్ రూ.15 కోట్ల అప్పు తీసుకున్నారు. అయితే ఆయన ఆ అప్పు తీర్చకపోవడంతో లైకా ప్రొడక్షన్స్ ఆ రుణాన్ని బదలాయించుకోవడానికి ఒప్పందం చేసుకుంది. ఆ తర్వాత 30 శాతం వడ్డీతో కలిపి మొత్తం రూ.21.29 కోట్లు చెల్లించేలా విశాల్‌లో ఒప్పందం చేసుకుంది. అలాగే భవిష్యత్తులో విశాల్ ప్రాజెక్టులపై లైకాకు హక్కులు కూడా ఇచ్చేలా రాసుకున్నారు. అయితే విశాల్ తాను నటించిన 'వీరమె వాగై చూడమ్' సినిమాను బయటి సంస్థకు అమ్మేయడంతో లైకా ప్రొడక్షన్స్ సంస్థ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. ఒప్పందం ఉండగా బయటి వ్యక్తులకు సినిమా హక్కులు ఎలా అమ్మేశారని న్యాయస్థానం విశాల్‌ని ప్రశ్నించగా.. తాను కేవలం వైట్ పేపర్ల మీద మాత్రమే సంతకం చేశానని, సినిమాల విషయంలో ఒప్పందం జరగడం అనేది తనకు తెలియదని తెలిపాడు. దీంతో జడ్జి ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఇది సినిమా షూటింగ్ కాదు.. చాలా తెలివిగా సమాధానం చెబుతున్నారనుకోకండి అని చురకలు అంటించారు.

లైకా ప్రొడక్షన్స్ చేసుకున్న అగ్రిమెంటులో కొన్ని షరతులు చట్ట వ్యతిరేకంగా ఉన్నాయని పేర్కొంటూ లైకాకు రూ.5లక్షల జరిమానా విధించింది. అలాగే రూ.15 కోట్లు డిపాజిట్ చేయడంతో పాటు ఆస్తుల వివరాలు సమర్పించాలని విశాల్‌ని ఆదేశించింది. అయితే విశాల్ కోర్టు ఆదేశాలు పాటించకపోవడంతో తన చిత్రాల విడుదలపై నిషేధం విధించింది. రెండున్నరేళ్లుగా కొనసాగుతున్న ఈ కేసు విచారణను ముగించిన న్యాయస్థానం గురువారం తుది తీర్పు ఇచ్చింది. లైకా సంస్థకు 30 శాతం వడ్డీతో రూ.21 కోట్లు చెల్లించాలంటూ విశాల్‌ను ఆదేశించింది. ఈ తీర్పు విశాల్‌కు గట్టి షాకేనని చెప్పాలి. మరి దీనిపై ఆయన ఎలా స్పందిస్తారో చూడాలి.

విశాల్‌కి లైకా ప్రొడక్షన్స్‌తో ఇదొక్కటే పంచాయతీ కాదు. గతంలో 'పందెంకోడి 2' చిత్రానికి గాను థియేట్రికల్, శాటిలైట్ హక్కులను ఇదే సంస్థకి రూ.23.21 కోట్లకు విక్రయించారు. అయితే లైకా సంస్థ ఆ మొత్తంపై 12 శాతం జీఎస్టీ చెల్లించలేదని విశాల్ ఆరోపించారు. ఈ వివాదం కోర్టు వరకు వెళ్లింది. చివరికి 2024లో ఇరు పక్షాలు మధ్యవర్తిత్వం ద్వారా సమస్యని పరిష్కరించుకున్నాయి. 47 ఏళ్లు వచ్చినా బ్యాచిలర్‌గానే ఉన్న విశాల్ తాను పెళ్లి చేసుకోబోతున్నట్లు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. హీరోయిన్ సాయి ధన్సికతో ఆగస్టు 29న వివాహం జరగనుందని ఆయన ప్రకటించారు.

# ఏది మాట్లాడినా రాజకీయమే


కన్నడ భాష తమిళం నుంచే పుట్టిందంటూ కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు ఎంత దుమారం రేపుతున్నాయో చూస్తూనే ఉన్నాం. వీటి కారణంగా 'థగ్ లైఫ్' చిత్రం కర్ణాటకలో రిలీజ్ చేయలేని పరిస్థితి తలెత్తింది. కన్నడ సంఘాల నుంచి ఎన్ని విమర్శలు, బెదిరింపులు వస్తున్నా తాను క్షమాపణ చెప్పబోనని కమల్ హాసన్ తెగేసి చెప్పారు. చివరికి హైకోర్టు చీవాట్లు పెట్టినా ఆయన వెనక్కి తగ్గలేదు. కమల్ హాసన్ వ్యాఖ్యలపై తాజా రానా దగ్గుబాటి స్పందించారు.



మణిరత్నం, కమల్ హాసన్ కాంబినేషన్లో తెరకెక్కిన 'థగ్ లైఫ్' సినిమా గురువారం విడుదలై మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఎప్పుడో 1987లో వచ్చిన 'నాయకన్'( తెలుగులో 'నాయకుడు') సినిమా తర్వాత మణిరత్నం, కమల్ కలిసి చేసిన సినిమా ఇదే కావడంతో 'థగ్ లైఫ్'పై మంచి అంచనాలు ఉన్నాయి. అయితే కన్నడ భాషపై కమల్ చేసిన వ్యాఖ్యలతో కొద్దిరోజులుగా ఈ సినిమా గురించే మాట్లాడుకుంటున్నారు. కర్ణాటకలో నిర్వహించిన ప్రమోషన్లలో కమల్ హాసన్ మాట్లాడుతూ.. 'కన్నడ బాష తమిళం నుంచే పుట్టింది' అంటూ వ్యాఖ్యానించారు.

ఆయన వ్యాఖ్యలపై కన్నడ భాషా సంఘాలు మండిపడ్డాయి. కమల్ క్షమాపణ చెప్పకపోతే కర్ణాటకలో 'థగ్ లైఫ్' మూవీని రిలీజ్ ఆపేస్తామని కర్ణాటక ఫిలిం ఛాంబర్ ప్రకటించగా తాను ప్రేమతో అన్న మాటలకు క్షమాపణ ఎలా చెబుతానని కమల్ రిప్లయ్ ఇచ్చారు. పైగా వారి నిర్ణయంపై ఆయన కర్ణాటక హైకోర్టును ఆశ్రయించగా ఒక్క క్షమాపణతో సమసిపోయే వివాదాన్ని ఇంతవరకు ఎందుకు తెచ్చుకున్నారని న్యాయస్థానం ఆయనపైనే మండిపడింది. మరోవైపు ఈ చిత్రాన్ని కర్ణాటకలో రిలీజ్ చేయకపోవడంతో మేకర్స్‌కి రూ.12 కోట్ల వరకు నష్టం వచ్చినట్లు తెలుస్తోంది. అయితే కమల్ హాసన్ వ్యాఖ్యలపై తాజాగా దగ్గుబాటి రానా స్పందించారు. ఆయన నటించిన 'రానా నాయుడు 2' వెబ్‌సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. 'సోషల్ మీడియా ఇప్పుడు అభిప్రాయం వ్యక్తం చేసే వేదికగా మారింది. ఒకప్పుడు ఇలా లేదు. ప్రస్తుతం ఎవరు దేని గురించి మాట్లాడినా రాజకీయం అయిపోతోంది. ప్రతి మాట, ప్రతి విషయాన్ని వివాదాస్పదంగా మార్చేస్తున్నారు' అన్నారు రానా.

రానా నాయుడు సీజన్ 2 వెబ్ సిరీస్ ఈ నెల 13న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. ఇందులో రానా దగ్గుబాటి, వెంకటేష్ దగ్గుబాటి ప్రధాన పాత్రల్లో నటించారు. అర్జున్ రాంపాల్ రాఫ్ అనే క్రూరమైన గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ఫస్ట్ సీజన్ మొత్తం బూతులు, అసభ్య సన్నివేశాలు ఉండటంతో ఈ వెబ్ సిరీస్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఫ్యామిలీ హీరోగా ముద్రపడిన వెంకటేష్ ఇందులో



నటించడాన్ని ఆయన ఫ్యాన్స్ జీర్ణించుకోలేకోకపోయారు. ఇటీవల ఓ ఈవెంట్లో రానా మాట్లాడుతూ... 'రానా నాయుడు' సిరీస్‌ని ప్రపంచం మొత్తం చూసింది కానీ మన తెలుగు వాళ్లు మాత్రం చూడలేదన్నారు. సీజన్-2లో బూతులు తగ్గించి.. వయొలెన్స్ ఎక్కువ పెట్టామని తెలిపారు. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,